PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 114 | విజయవాడ, మంగళవారం 25 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 25 November 2025 | Rs

కొలిక్కిరాని జిల్లాల పునర్విభజన

ఆర్డినెన్స్ ద్వారా మదనపల్లె, మార్కాపురం జిల్లాలు

రంపచోడవరం కేంద్రంగా డెవలప్‌మెంట్ అథారిటీ

28న కేబినెట్‌లో నిర్ణయం

నేడు భేటీ కానున్న కేబినెట్ సబ్ కమిటీ

2

మహిళల కబడ్డీ ప్రపంచ కప్ విజేత భారత్

8

యాక్షన్ కింగ్ ధర్మేంద్ర కన్నుమూత

రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు సంతాపం

న్యూఢిల్లీ : బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర (89) సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ముంబైలోని తన నివాసంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య హేమామాలిని, కుమారులు సన్నీడియోల్, బాబీ డియోల్ ఉన్నారు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బందిపడుతుండగా కుటుంబ సభ్యులు ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించటంతో ఇంటికి తీసుకెళ్లి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తుండగా, సోమవారం మరణించారు. హిందీ చిత్ర పరిశ్రమలో తొలితరం యాక్షన్ హీరో (యాక్షన్ కింగ్)గా ఆయన సినీ ప్రియులను ఆకట్టుకున్నారు. ఐకానిక్ 'షోలే'తో సహా 300కు పైగా చిత్రాల్లో ధర్మేంద్ర నటించారు. 1997లో ఫిలింఫేర్ జీవిత సాఫల్య పురస్కారం, 2012లో పద్మభూషణ్ అందుకున్నారు. పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. 1958లో 'దిల్ బీ తేరా హమ్ బీ తేరే' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. తన కెరీర్‌లో 'షోలే', 'చుప్కే చుప్కే', 'ధర్మ్‌వీర్' 'సీటా ఔర్ గీత', 'యాదోంకి బారాత్' వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో నటనలో తనదైన శైలిని చూపించారు. 2004 నుంచి ఐదేళ్లపాటు పార్లమెంట్ సభ్యుడిగా ప్రజాజీవితంలో ఉన్నారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు 'హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్' అనే బిరుదు ఇచ్చారు. ధర్మేంద్ర నటించిన తాజా చిత్రం 'ఇక్కీస్' విడుదలకు సిద్ధమవుతోంది. ఇది పరమవీర చక్ర గ్రహీత లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం. ఇందులో ఆయన హీరో తండ్రి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. డిసెంబర్ 8న తన 90వ పుట్టినరోజు జరుపుకోబోతున్న ధర్మేంద్ర కన్నుమూయడంతో ఆయన అభిమానులు శోక సంద్రంలో మునిగిపోయారు. బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ తదితరులు నివాళులర్పించారు.

ప్రముఖుల సంతాపం

ధర్మేంద్ర మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతీయ సినిమాలో ఒక శకం ముగిసిందని, ఆయన మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 'ధర్మేంద్ర భారతీయ సినీ చరిత్రలో ఒక మహోన్నత వ్యక్తిగా, యువ నటీనటుల్లో ఎంతో స్ఫూర్తిని నింపారు' అని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'ధర్మేంద్ర తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల హృదయాల్లో నిలిచారు. నిరాడంబరత, వినయం, తోటివారిని ఆప్యాయంగా పలకరించే వ్యక్తిత్వం ఆయనకే సొంతం' అని ప్రధాని తెలిపారు. ధర్మేంద్ర భారతీయ సినిమాను సుసంపన్నం చేశారని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పేర్కొన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా అద్భుతమైన నటన, సాటిలేని బహుముఖ ప్రజ్ఞతో సినీ ప్రేమికులను ఆకట్టుకున్నారని తెలిపారు. ధర్మేంద్ర మృతి దిగ్భ్రాంతిని కలిగించిందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన కృషి తరతరాలు గుర్తుండిపోతుందన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, విశిష్ట నటుడిని కోల్పోవడం చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ధర్మేంద్ర కన్నుమూశారని తెలిసి చింతించినట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ధర్మేంద్ర దిగ్గజ నటుడే కాదని, సహృదయం కలిగిన వ్యక్తి అని చిరంజీవి పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌ల పేరుతో శ్రామికవర్గంపై దాడి

- మీడియాతో బి.వి.రాఘవులు
- 26న దేశవ్యాప్త ఆందోళనకు మద్దతు
- గూగుల్ డేటా సెంటర్ వివరాలు బయటపెట్టాలి
- సంజీవని పేరుతో ఆరోగ్యసేవలు ప్రైవేటుపరం
- రైతులను అప్పుల పాల్జేస్తున్న ప్రభుత్వం : వి.శ్రీనివాసరావు
- బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాలుగు లేబర్‌కోడ్ అమలు కోసం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేయడం శ్రామికవర్గంపై దాడని, దీన్ని రాష్ట్రాలు కూడా ఖచ్చితంగా అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి చేయడం అప్రజాస్వామికమని, వాటి హక్కులనూ కాలరాయడమేనని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. సోమవారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ యజమానులకు పూర్తి అనుకూలంగా లేబర్‌కోడ్‌లు రూపొందించి, అమలు చేయాలని రాష్ట్రాలను ఒత్తిడి చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ తెచ్చిందని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ కోడ్‌లు కార్మికవర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని చెప్పారు. వీటిల్లో కనీస వేతనం నిర్వచనాన్ని అస్పష్టంగా పేర్కొన్నారని అన్నారు. కార్మిక యూనియన్లకు సమ్మె చేసే హక్కును, వేతనాల కోసం యజమాన్యంతో చర్చించే హక్కునూ లేకుండా చేశారని విమర్శించారు. కార్మికశాఖను పనికిరాని సంస్థగా మార్చేశారని, అధికారులను ఫెసిలిటేటర్లుగా పేర్కొన్నారని తెలిపారు. గిగ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించలేదని పేర్కొన్నారు. కార్మికరంగం రాష్ట్రాల పరిధిలో ఉంటుందని, దాన్ని కూడా కేంద్రం పరిధిలోకి తీసుకుంటోందని మిగతా 7లో

మీడియాతో మాట్లాడుతున్న బివి రాఘవులు, చిత్రంలో వి శ్రీనివాసరావు

చంద్రబాబుకు నిజాయితీ ఉంటే విశాఖకు సొంత గనులు కేటాయించాలి

అసలు ఉనికిలోలేని మిట్టల్ ఫ్యాక్టరీకి గనులు కేటాయించిన ప్రభుత్వం విశాఖ స్టీలుకు సొంత గనులు కేటాయించడం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా దీనిపై నోరెత్తడం లేదని వి. శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబు అసహనంతో కార్మికులపై నోరు పారేసుకుంటున్నారని, విశాఖ ఉక్కును ఆదుకోవాలని ఆయనకు నిజాయితీ ఉంటే ముందుగా విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు గనులు కేటాయించకుండా, ఉన్న కార్మికులను తొలగిస్తూ నష్టాల పాల్జేస్తూ ప్రైవేటీకరణ ఆపుతాము అంటే ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. పైకి ఎన్ని మాటలు చెప్పినా ప్రైవేటీకరణను ఆపకుండా ప్లాంటును దెబ్బతీసే విధంగా వ్యవహరించడం పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు.

సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆదివారం పదవీ విరమణ చేసిన సిజెఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9 వరకూ 15 నెలలపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సిజెఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హర్యానా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ నిలిచారు. ఈ కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల ప్రధాన న్యాయమూర్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, పీయూష్ గోయల్, లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఇఎస్ఐలో ప్రమాదం

- స్లాబ్ కూలి కార్మికుడు మృతి

కూలిన స్లాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం సనత్‌నగర్ ఇఎస్ఐ ఆస్పత్రిలో సోమవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనానికి పెట్టిన సెంట్రింగ్‌తో పాటు స్లాబ్ కుప్పకూలింది. ఈ సంఘటనలో ఒక కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం.. సనత్ నగర్ ఇఎస్ఐ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలో భవన ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం ఎప్పటిలానే కార్మికులు పని చేస్తుండగా సెంట్రింగ్‌తో పాటు శ్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. సెంట్రింగ్ రాడ్లతో పాటు శ్లాబ్ కాంక్రీట్ శిథిలాలు కార్మికులపై పడటంతో అక్కడే పని చేస్తున్న భానుచందర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. రఘుపతి, మోహన్, మల్లేష్, మైసయ్య అనే కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఇఎస్ఐ ఆస్పత్రి మల్టీ స్పెషాలిటీ బ్లాక్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాగా, వీరి లో రఘుపతి, మోహన్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఇఎస్ఐ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ శిరీష్ కుమార్ చవాన్ తెలిపారు. భానుచందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తుపానుగా వాయుగుండం!

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దక్షిణ అండమాన్ సముద్రంలో మలేసియా, మలక్కా జలసంధి ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ అండమాన్ సముద్రంలో ఈ నెల 25న వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. రానున్న 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని వివరించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం కొమోరిన్, నైరుతి బంగాళాఖాతం-శ్రీలంక ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

- వచ్చే జూన్‌లోగా జారీ
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ వ్యవస్థను అమలు చేయాలన్నారు. పభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ,పౌరసేవల పర్యవేక్షణకు వీలుగా ఈ కార్డును రూపొందించాలన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ నిర్వహిస్తున్న డేటా లేక్‌తో సమాచార సేకరణ జరగాలని సూచించారు. రాష్ట్రంలో పి4 వంటి అంశాలను అందులో చేర్చాలన్నారు. ఆర్టిజిఎస్ వద్ద సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలని తెలిపారు. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలన్నారు. వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బిఎంఎస్ ఐడి, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డులు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డులతో గుర్తించేలా చూడాలన్నారు. కేవలం పెన్షన్‌లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ వ్యవస్థను పరిమితం చేయవద్దని, పౌరులకు చెందిన అన్ని వివరాలను నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని సూచించారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డులతో అర్హులైన వారందరికీ పథకాలు అందించడంతోపాటు సులభంగా పౌరసేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థతో పరిష్కారం అవుతాయని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్‌తో కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఫ్యామిలీ కార్డును స్మార్ట్ కార్డుగా, వచ్చే ఏడాది జూన్‌లోగా జారీ చేయాలన్నారు. ఒకే కార్డు ద్వారా పౌరులు అన్ని ప్రభుత్వ సేవల్ని, పథకాలను అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా రూపొందించాలని సూచించారు. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించాలన్నారు. ఈ సమీక్షలో సిఎస్ కె.విజయానంద్, ఆర్థిక, వైద్య ఆరోగ్య, గ్రామ, వార్డు సచివాలయ, పురపాకల, ప్రణాళిక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పౌర సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- రియల్ టైమ్ గవర్నెన్స్‌లో సిఎం చంద్రబాబు

2

హెచ్‌ఆర్ పాలసీ అమలు, రెగ్యులర్ చేయాలని

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

- సమ్మె సందర్భపు హామీలు అమలు చేయాలి
- డిసెంబర్ 10న చలో విజయవాడ : కాంతారావు

కోనసీమ జిల్లాలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

రెగ్యులరైజ్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్-జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఉద్యోగులు ధర్నా చేపట్టారు. గత 21 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర విద్యా శాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులను విలీనం చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా అన్ని కేటగిరీల ఉద్యోగులకూ వేతనాలు పెంచాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్లు, డిఆర్‌ఒలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ ఆందోళనకు సిఐటియు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించాయి.

విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్-జెఎసి చైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎన్నో ఏళ్లగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఇపిఎఫ్ గ్రాట్యుటీ-పెన్షన్ ప్రయోజనాల అమలు, ఆరోగ్య బీమా మరియు మెడికల్ సదుపాయాలు కల్పించాలని, మిగతా 7లో

బ్రిటన్ నుంచి దుబాయ్‌కు..!

- వ్యాపారాలు తరలించే యోచనలో లక్ష్మీ మిట్టల్

లండన్ : బ్రిటన్ ప్రభుత్వం సంపన్నులపై పన్నుల భారాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవడంతో అక్కడి ధనవంతులు పన్ను మినహాయింపు దేశాలకు తరలిపోతున్నారు. ఈ క్రమంలోనే భారత్‌కు చెందిన దిగ్గజ స్టీల్ పారిశ్రామికవేత్త లక్ష్మీ మిట్టల్ బ్రిటన్ నుంచి తన వ్యాపారాలను వేరేప్రాంతానికి తరలించే పనిలో ఉన్నారని రిపోర్టులు వస్తున్నాయి. ప్రభుత్వ పన్ను విధానం నేపథ్యంలో ఆ దేశాన్ని వీడాలని మిట్టల్ నిర్ణయించుకున్నట్లు బ్రిటన్ మీడియా పేర్కొంది. ఇకపై పెట్టుబడులన్నీ దుబాయ్‌లోనే పెట్టే యోచనలో మిట్టల్ ఉన్నట్లు వెల్లడించింది. నాన్ డోమ్ పన్ను విధానాన్ని రద్దు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ పన్ను విధానం కింద అక్కడి నివాసితులు విదేశాల్లో సంపాదించిన ఆదాయంపై బ్రిటన్ ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. 226 సంవత్సరాల నుంచి ఈ పన్ను వెసులుబాటు ఉంది. అయితే ఇప్పుడు ఈ విధానాన్ని తొలగించాలని కీర్ స్టార్మర్ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకునేందుకు సంపన్నులు దేశం వీడుతున్నారు.

ఆయుధాలు వదిలేస్తాం

ఫిబ్రవరి వరకూ సమయమివ్వండి

మావోయిస్టు పార్టీ ఎంఎంసి జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్

మూడు రాష్ట్రాల సిఎంలకు లేఖ

ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి జిల్లా)

తాము ఆయుధాలను వదిలేసి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు తమకు ఫిబ్రవరి వరకూ సమయం ఇవ్వాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ కోరినట్టుగా ఓ బహిరంగ లేఖ సోమవారం బయటకొచ్చింది. ఆయన ఈ లేఖను మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పంపించారు. దేశంలో, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేసి, ఆయుధాలు విడిచిపెట్టి సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకోవాలని తమ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోను దాదా అలియాస్ మల్లోజుల వేణుగోపాల్ తీసుకున్న నిర్ణయానికి తాము మద్దతునిస్తున్నట్టు అనంత్ తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యులు సతీష్ దాదా, చంద్రన్న కూడా ఇదే నిర్ణయానికి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. ఆయుధాలు విడిచిపెట్టి, ప్రభుత్వ పునరావాసం, పునరాగమనం పథకాన్ని ఎంఎంసి స్పెషల్ జోనల్ కమిటీ కూడా అంగీకరిస్తోందని తెలిపారు. అయితే, దీని కోసం తాము మూడు రాష్ట్రాల ప్రభుత్వాలను ఫిబ్రవరి 15 వరకూ సమయం కోరుతున్నామన్నారు. తమ పార్టీ ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలపై నడుస్తున్నందున, నిర్ణయాన్ని సామూహికంగా తీసుకోవడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. మావోయిజం నిర్మూలనకు ప్రభుత్వం విధించిన గడువు 2026 మార్చి 31లోపే తమ ప్రతిపాదన ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు కొంచెం సంయమనం పాటించాలని, భద్రతా దళాల ఆపరేషన్లను నిలిపివేయాలని కోరారు. ఇన్‌ఫార్మర్ల కార్యకలాపాలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

బాధితుడిని పరామర్శిస్తున్న ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్

'బండ్లమూడి' బాధితులను ఆదుకుంటాం

- ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడి దళితవాడ ఘటనలోని బాధితులను రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎల్. జవహర్ పరామర్శించారు. బండ్లమూడి దళితవాడను సోమవారం ఆయన సందర్శించారు. అగ్రవర్ణాల దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించి, ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ... బండ్లమూడి ఘటనకు సంబంధించిన పరిస్థితులను ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎకరా చొప్పున భూమి, నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారని, దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. దాడిలో గాయపడిన మూడు కుటుంబాల వారికి ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులపై పెట్టిన కౌంటర్ కేసులను తొలగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. గ్రామంలో కులవివక్షతకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మణ్ నాయక్, ఒంగోలు ఆర్‌డిఒ లక్ష్మీ ప్రసన్న, చీమకుర్తి తహశీల్దారు బ్రహ్మయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు సురేష్, విశ్వనాథన్, నాగరాజు, రామకృష్ణ, సాంబయ్య, వెంకటేశ్వర్లు, ఆనందు, మోషే పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో పోలీస్ కస్టడీకి ఐదుగురు నిందితులు

- విచారిస్తున్న సిట్, ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

నకిలీ మద్యం తయారీ కేసులో ఐదుగురు నిందితులను సోమవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులు అశ్రఫ్, బాలాజీ, సుదర్శన్, చైతన్య బాబు, శ్రీనివాసరావును పోలీస్ కస్టడీ తీసుకొని విచారణ చేపడుతున్నారు. తొలుత నిందితులను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

అనంతరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు, సిట్ అధికారుల ఆధ్వర్యంలో నిందితులను విచారిస్తున్నారు. బెల్టు షాప్‌లకు సరఫరా చేసిన వివరాలు, ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు, తంబళ్లపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి దాసరపల్లి జయచంద్రారెడ్డితో ఉన్న ఆర్థిక లావాదేవీలు, పలు కీలక విషయాలపై పోలీసులు నిందితులను విచారించినట్లు తెలిసింది. ఈ కేసులో 36 మంది నిందితులకు గాను 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

పౌర సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- రియల్ టైమ్ గవర్నెన్స్‌లో సిఎం చంద్రబాబు
- నిరంతరం డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునేలా ప్రణాళికలు ఉండాలని సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌర సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం చంద్రబాబునాయుడు హెచ్చరించారు. సచివాలయంలో సోమవారం రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలు అందించే పౌర సేవలు ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిరంతరం డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు సమర్థంగా ప్రజల్లోకి వెళ్లాలన్నారు. ప్రజామోదం మేరకే మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనులు చేపట్టేలా చూడాలని, గ్రామీణ ప్రాంతాల్లోనూ గ్రామ సభల అనుమతి లేకుండా పనులు చేపట్టవద్దని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

నరేగా పనులకు కూడా ఇదే నిబంధన వర్తించేలా చూడాలన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమర్థంగా వివిధ అంశాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, పౌరసేవలకు సంబంధించి ప్రతి అంశంలోనూ జవాబుదారీ తనం అనేది కీలకమైన అంశంగా పరిగణించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రజలకు అందుబాటులోకి "అవేర్‌యాప్" :

వాతావరణ హెచ్చరికలతో సహ 42 అంశాల్లో నిరంతర సమాచారం కోసం అవేర్‌యాప్‌ను ప్రజల వినియోగం కోసం విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు డేటాలేక్‌కు అనుసంధానం కావాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో బ్యాండ్ విడ్త్ కనెక్టివిటీని పెంచాలని స్పష్టం చేశారు. సంక్షేమ హాస్టళ్లలోని తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై పర్యవేక్షణ జరగాలని సూచించారు. ఇందుకోసం యాప్‌ను రూపొందించి రోజువారీగా తనిఖీలు చేస్తున్నామన్నారు.

కాలుష్యనియంత్రణ మండలితో కలిసి ఎయిర్ క్వాలిటీ సెన్సార్లు ఏర్పాటు చేసి ఆ వివరాలను కూడా ప్రజలకు అందించాలని సిఎం పేర్కొన్నారు సుపరిపాలనా అంశాలపై డిసెంబరులో ఎంపిలు, ఎమ్మెల్యేలతో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారుల్లోనూ పాలనా సామర్థ్యాలు పెరిగేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

నైతిక విలువలతో సమాజంలో మార్పు

- విద్యాసదస్సులో మంత్రి లోకేష్

విద్యా సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నైతిక విలువల ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళాక్షేత్రంలో సోమవారం "నైతిక విలువలు"పై రాష్ట్రస్థాయి విద్యా సదస్సు జరిగింది. సదస్సులో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... చాగంటి కోటేశ్వరరావు ద్వారా నైతిక విలువలపై పుస్తకాలు రూపొందించి విద్యార్థులకు అందిస్తున్నామని, నైతిక విలువల ద్వారానే ఉత్తమ పౌరులు తయారవుతారని చెప్పారు. పిల్లలకు చదువుతోపాటు నైతిక విలువలు నేర్పితే సమాజంలో ఆశిస్తున్న మార్పును సాధించగలుగుతామని తెలిపారు.

వారిని సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మార్పు మన ఇంటినుంచే మొదలు కావాలని కోరారు. సినిమాల్లో, వెబ్ సిరీస్‌ల్లో మహిళలను అవమాన పరిచే డైలాగులు, సన్నివేశాలు ఉండకూడదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో చర్చించామని చెప్పారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించామన్నారు.

సమాజోద్ధరణకు విద్య ఉపయోగపడాలి : చాగంటి

రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారులు, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ...సమాజోద్ధరణకు విద్య ఉపయోగపడాలన్నారు. ప్రస్తుత సమాజంలో కుటుంబాల్లో విలువలు తగ్గిపోతున్నాయని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, అవగాహన తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ అమ్మను గౌరవించడం నేర్చుకోవాలని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల మాట వినడం, అన్నదమ్ములను ప్రేమించడం ప్రారంభమైతే వారు సమాజాన్ని ప్రేమించడంతోపాటు వారిలో నైతిక విలువలు అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా పాల్గొన్నారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు

రూ.6,400 కోట్లు విడుదల చేయాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం ఆయన లేఖ రాశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పేద తరగతుల విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి చేయడంతో వారి చదువులకు నష్టం వాటిల్లుతుందన్నారు.

6 సెమిస్టర్ల ఫీజు బకాయిలు రూ.4,200 కోట్లు, స్కాలర్ షిప్ బకాయిలు రూ.2,200 కోట్లు కలిపి రూ.6,400 కోట్లను వెంటనే విడుదల చేయాలని లేఖలో కోరారు.

26న నిరసన ప్రదర్శనలకు సిపిఐ మద్దతు

రైతాంగ, కార్మిక సమస్యలకు పరిష్కారాలు డిమాండ్ చేస్తూ, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపు మేరకు నవంబరు 26న జిల్లా కేంద్రాల్లో జరగనున్న నిరసన ప్రదర్శనలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య మద్దతు ప్రకటించారు.

రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- సిపిఎం నాయకులు ఎంఎ గఫూర్
- కెపిఎస్ ఆధ్వర్యంలో 48 గంటల జల సమర దీక్ష ప్రారంభం



జలసమరదీక్షనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం కేంద్రకమిటీ మాజీ సభ్యులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ డిమాండ్ చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించేందుకు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు చేపట్టాలని కోరుతూ కర్నూలు ప్రగతిసమితి (కెపిఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ ధర్నాచౌక్‌లో 48 గంటల జల సమరదీక్ష ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని ఎంఎ.గఫూర్ సందర్శించి మాట్లాడారు. జిల్లాలో గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను చేపడతామని సిఎం చంద్రబాబు నాయుడు 2014 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రకటించి, 2019 ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేశారని అన్నారు. అప్పటినుంచి ఈ ప్రాజెక్టులకు ఒక్కపని కూడా ప్రారంభించలేదన్నారు. వెంటనే ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరపాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.లక్షల కోట్లు రాష్ట్రానికి వస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల ప్రారంభానికి పూనుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే రాయలసీమ నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలా వ్యవహరిస్తే టిడిపి కూటమి ప్రభుత్వానికి కూడా ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు జరుగుతున్న ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త రవీంద్రవిద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, కెవి.సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి సుబ్బారెడ్డి, కర్నూలు జిల్లా మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు మన్సూర్ రెహమాన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి గుండ్రేవుల ప్రాజెక్టుపరిష్కారం అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. శ్రీహర్ష మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో తీవ్రకరువు పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. కరువును పారద్రోలేందుకు సాగునీటి ప్రాజెక్టులను చేపట్టాలని డిమాండ్ చేశారు. జల సమర దీక్షకు కోడుమూరు, గూడూరు, సి బెళగల్ మండలాల రైతులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని జిల్లాల పునర్విభజన

- ఆర్డినెన్స్ ద్వారా మదనపల్లె, మార్కాపురం జిల్లాల ఏర్పాటు
- రంపచోడవరం కేంద్రంగా డెవలప్‌మెంట్ అథారిటీ
- 28న కేబినెట్‌లో తుది నిర్ణయం
- నేడు భేటీ కానున్న కేబినెట్ సబ్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లాల పునర్విభజన, కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు, మండలాల భౌగోళిక స్వరూపాల మార్పు, పాలనాపరమైన సౌలభ్యం వంటి కీలకాంశాలపై సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన కేబినెట్ సబ్‌కమిటీ, అధికారులతో సమీక్షా సమావేశం

ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. దీంతో మంగళవారం మరోసారి భేటీ కావాలని నిర్ణయించినట్లు సమాచారం. మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలపై మరోసారి అధ్యయనం చేయాలని సిఎం మంత్రులకు సూచించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్డినెన్స్ ద్వారా మదనపల్లె, మార్కాపురం జిల్లాలు నూతనంగా ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 28న జరుగనున్న కేబినెట్ సమావేశంలో కూలంకషంగా చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలిసింది. గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న ప్రాంతాన్ని అంతా కలిపి ప్రత్యేకంగా ఒక గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని, ప్రజలు కోరుకుంటుండగా, ప్రభుత్వం ఆ దిశగా కాకుండా రంపచోడవరం కేంద్రంగా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అథారిటీలో ఐఎఎస్ స్థాయి అధికారిని నియమించడం ద్వారా పరిపాలనా సౌలభ్యం సులభంగా ఉంటుందని అంచనావేస్తున్నారు. అంతేకాకుండా పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లోని బాధితులకు పునరావాసకేంద్రాలు, ఆర్‌ఓఆర్ అమలుతోపాటు, ప్రభుత్వం విడుదల చేసే నిధులు స్థానికంగా గిరిజనులకు అందించేందుకు డెవలప్‌మెంట్ అథారిటీ ఉపయోగపడుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది ఇలా ఉంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసేవా సంస్థలు, రాజకీయ నేతల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మార్పులు, చేర్పులు విషయంపై పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. ఇందులో ప్రభుత్వ పరిశీలనలో ఆరు రెవెన్యూడివిజన్లు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నప్పటికీ భౌగోళిక,స్థానిక పరిస్థితుల దృష్ట్యా, వాటిని రెంటికి కుదించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకిని ఉమ్మడి ప్రకాశం జిల్లాలోకి, తిరుపతి జిల్లాలోని గూడూరును ఉమ్మడి నెల్లూరు జిల్లాలోకి మార్చేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇక విజయవాడ విషయానికి వస్తే పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిస్థితి ప్రభుత్వానికి తలనొప్పిగా మారడంతో ఈ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం దొరికే అవకాశాలు లేవని తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరు ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో కలిపారు. అక్కడి ప్రజలు , ప్రజాప్రతినిధులు గతంలో మాదిరిగానే ప్రకాశం జిల్లాలో కలపాలనే వత్తిడి ఉన్నప్పటికీ రామాయపట్నం పోర్టు దృష్ట్యా ప్రకాశంలో కలిపితే పాలనాపరమైన ఇబ్బందులు తప్పవనే ఆలోచన నేపథ్యంలో కందుకూరు విషయంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నట్లు సమాచారం.

'రైతన్నా...మీకోసం'లో పంచసూత్రాలు

- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

రైతులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - ఘంటసాల : రైతుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం నూతనంగా "రైతన్నా.. మీకోసం" పేరుతో పంచ సూత్రాలు ప్రవేశపెట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని రాష్ట్రంలో తొలిసారిగా కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామంలో మంత్రి సోమవారం ప్రారంభించారు. ఘంటసాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులతో వారి మొబైల్ ఫోన్లలో ఎపి ఎయిమ్స్ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రైతన్నా.. మీకోసం' ద్వారా ప్రధానంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి ఐదు అంశాల్లో ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... ధాన్యం సొమ్ము రైతులకు 48 గంటల్లో చెల్లించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఘంటసాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని, ప్రస్తుత భవనానికి మరమ్మత్తులు చేయాలని, నాగాయలంక మండలం భావదేవరపల్లిలోని మత్స్య పాలిటెక్నిక్‌ను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసి ఫ్యాకల్టీని నియమించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థులతో, సిబ్బందితో మాట్లాడి కళాశాల అభివృద్ధికి నూతన భవనాల నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, డైరెక్టర్ డాక్టర్ మంజూర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద లేబర్ కోడ్ ప్రతులను దగ్ధం చేస్తున్న మెడికల్ రిప్స్

26న దేశ వ్యాప్త ఆందోళనలు

- లేబర్ కోడ్స్ ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి - యంత్రాంగం

లేబర్ కోడ్స్ అమలును వ్యతిరేకిస్తూ ఈ నెల 26న దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు లేబర్ కోడ్స్ ప్రతులను దగ్ధం చేశారు. కలెక్టరేట్లు వద్ద ధర్నాలు నిర్వహించారు.

విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన అనంతరం ఎపి ఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్ మాట్లాడారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న పని గంటలు సంఘాలు పెట్టుకునే హక్కు సాధించుకుంటే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చి ఆ హక్కులను కాలరాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అనంతపురం జిల్లాలో కలెక్టర్ ఒ ఆనంద్‌కు సిఐటియు రాష్ట్ర నాయకులు జి ఓబులు, ఎపి మెడికల్ సేల్స్ రెప్రజెంటేవ్ యూనియన్ జాతీయ నాయకులు మనోహర్, ఎజి.రాజమోహన్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్ వినతిపత్రం అందజేశారు.

నెల్లూరులో సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె అజయ్‌కుమార్ మాట్లాడుతూ 26న దేశ వ్యాప్తంగా జరగనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

కాకినాడలో ఎపి ఎంఎస్‌ఆర్‌యు ఆధ్వర్యంలో, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కర్నూలు జిల్లాలో మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వెంకట్, ప్రసాద్ శర్మ పాల్గొన్నారు. విశాఖలోని అఫీషియల్ కాలనీలో ఆందోళనలు చేపట్టారు.

రైతులనుద్దేశించి మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

భూములను లాక్కుంటే ఊరుకోం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుర్ల (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా గుర్ల మండలంలో ఏర్పాటు చేయనున్న సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్‌కు 1085 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒను ఉపసంహరించుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కెల్ల, బెల్లానపేట, దమరసింగి, వల్లాపురం, మన్యపురిపేట, ఎస్ ఎస్ ఆర్ పేట గ్రామాలకు చెందిన రైతులు సోమవారం గుర్ల మండలంలోని కెల్ల జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులంతా భూ సేకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ వద్దు భూములే ముద్దు అని నినదించారు. రైతులనుద్దేశించి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులకు తెలియకుండా వారి భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకొని స్టీల్‌ప్లాంట్ పేరిట బడాబాబులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. పరిశ్రమల పేరిట భూములు సేకరించి రియల్ ఎస్టేట్‌లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రెండు పంటలు పండే సారవంతమైన భూములను ప్రభుత్వం తీసుకోవడానికి ప్రయత్నిస్తే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. స్టీల్ ప్లాంట్‌కు భూములను తీసుకోబోమని రాత పూర్వకంగా తహశీల్దారు తెలియ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ తాము అభివృద్ధికి ఆటంకం కాదని, రైతులకు అన్యాయం జరగకూడదని అన్నారు. తహశీల్దార్ హామీ ఇవ్వకపోవడంతో రైతులంతా ఆందోళనకు దిగారు. పాలకొండ రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, సిపిఎం నాయకులు టివి రమణ, వైసిపి, జనసేన నాయకులు, వందలాదిమంది రైతులు పాల్గొన్నారు.

వెలమల సిమ్మన్నకు లోకనాయక్ సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వెలమల సిమ్మన్న (ఫైల్ ఫొటో)

లోకనాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారం ఆంధ్ర విద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా పనిచేసిన ఆచార్య వెలమల సిమ్మన్నకు దక్కింది. ఆయనకు పురస్కార మొత్తంగా రూ.రెండు లక్షలు అందజేయనున్నారు. సాహితీవేత్తలు, కవులు, రచయితలు, పరిశోధకులు, కళాకారులను ప్రోత్సహిస్తూ వస్తున్న లోకనాయక్ ఫౌండేషన్ ఈ ఏడాది కూడా తన ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రకటించింది. ఆ వివరాలను ఫౌండేషన్ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సోమవారం విశాఖపట్నంలోని హిందీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. జీవన సాఫల్య పురస్కారాలను న్యూయార్క్‌లోని స్లోన్ కేటగిరీ వైద్యశాలలో పనిచేసిన కేన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నూరి దత్తాత్రేయుడుకు, డాక్టర్ తోటకూర ప్రసాద్‌కు, మిషిగాన్ రాష్ట్రంలోని డిట్రాయిడ్ నగరంలో పనిచేస్తున్న సుప్రసిద్ధ వైద్యులు డాక్టర్ వేములపల్లి రాఘవేంద్ర చౌదరికి, భీమవరం నుంచి వెళ్లి, ప్రస్తుతం రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్టన్ అండ్ చెల్సియా నగరానికి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆరేటి మహేష్‌కు అందజేయనున్నారు. లోకనాయక్ ఫౌండేషన్ పురస్కార మహోత్సవ కార్యక్రమం జనవరి 18న విశాఖలోని హోటల్ దస్పల్లాలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.దేవానంద్, చలనచిత్ర ప్రముఖులు తనికెళ్ల భరణి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారని యార్లగడ్డ తెలిపారు. మీడియా సమావేశంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి నల్లా బాబయ్య, కార్యవర్గ సభ్యులు జెవిఎల్.నరసింహారావు, జొన్నలగెడ్డ సుబ్రహ్మణ్యం, రాధిక మంగిపూడి పాల్గొన్నారు.

రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సాయిప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సాయిప్రసాద్‌కు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం జిఒ ఆర్‌టి నెంబరు 2201ని విడుదల చేసింది. ఇప్పటి వరకు సాయిప్రసాద్ జలవనరులశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తుండగా, తాజాగా ప్రభుత్వం రెవెన్యూ స్పెషల్ సిఎస్‌గా అదనపు బాధ్యతలు కేటాయించింది. ఇప్పటి వరకు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సిసిఎల్‌ఎగా పనిచేస్తున్న జయలక్ష్మికి అదనపు బాధ్యతలను తప్పించడంతో ఆమె ఇకపై సిసిఎల్‌గా విధులు నిర్వహించనున్నారు.

అక్రమ సస్పెన్షన్లు తక్షణమే రద్దు చేయాలి

- నేడు ఆర్‌టిసి డిపోల ఎదుట నిరసనలు
- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏలూరు ఆర్‌టిసి డిపోకు సంబంధించిన పెట్రోల్ బంకులో జరిగిన అవకతవకల్లో అసలు దోషులను వదిలి సంబంధం లేని వారిని అక్రమంగా సస్పెండ్ చేశారని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పేర్కొంది. అక్రమ సస్పెన్షన్స్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్‌టిసి డిపోల ఎదుట వీధి నాటకాల రూపాల్లో నిరసనలకు పిలుపునిస్తున్నట్లు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమ సస్పెన్షన్స్‌లో ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ అధ్యక్షులు సుందరయ్యను కక్ష సాధింపు ధోరణితో విధుల్లోంచి సస్పెన్షన్ చేశారన్నారు. అన్ని రకాల ప్రమాణాలను పశ్చిమ గోదావరి జిల్లా డిపిటిఒ/విజయవాడ జోన్ అధికారులు ఉల్లంఘించారన్నారు. అక్రమ సస్పెన్షన్‌లను ఎస్‌డబ్ల్యుఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పొడిగించాలని కేంద్రానికి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల వివరాలు సెంట్రల్ పోర్టల్‌లో నమోదు చేసేందుకు గడువు పొడిగించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాసినట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ తెలిపారు. వక్ఫ్ ఆస్తి వివరాలను సెంట్రల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు గడువు డిసెంబరు 5వ తేదీతో ముగియనుందన్నారు. రాష్ట్రంలో 4,748 రిజిస్టర్డ్, 10 వేల వరకూ రిజిస్టర్ కాని వక్ఫ్ ఆస్తులున్నాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 3,100 ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేసినప్పటికీ సాంకేతిక సమస్యల కారణంగా వచ్చే నెల 5వ తేదీలోపు రిజిస్టరయిన, రిజిస్టర్ కాని ఆస్తుల అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదని సిఎం లేఖలో వెల్లడించారని తెలిపారు. గడువు మరో 12 నెలలు పొడిగించాలని కేంద్రాన్ని కోరారన్నారు.

పవన్ కల్యాణ్‌కు రోడ్ల సెగ..!

- ఏలూరు జిల్లాలో డిప్యూటీ సిఎం పర్యటనలో జనం నిరసనలు
- పోలీసులు అడ్డగించడంతో రహదారిపైనే ఆందోళన
- లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గంగవరం గ్రామానికి రోడ్డు వేయాలంటూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు రోడ్ల సెగ తగిలింది. అధ్వానంగా తయారైన తమ గ్రామాలకు రోడ్లు వేయాలంటూ ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలోని పలు గ్రామాల ప్రజలు రోడ్డెక్కి నిరసనకు దిగారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సోమవారం పర్యటించారు. ప్రత్యేక విమానంలో రాజమండ్రి చేరుకున్న ఆయన రోడ్డుమార్గం గుండా కొయ్యలగూడెం మండలం రాజవరం చేరుకుని, అక్కడ నుంచి ఐఎస్.జగన్నాథపురం వచ్చారు. గంగవరం గ్రామంలోని రహదారి దాదాపు ఒకటిన్నర కిలోమీటర్లు దెబ్బతిందని, దశాబ్దాల తరబడి రోడ్డు వేయడం లేదని ఈ సమస్యను తెలియజేసేందుకు పవన్ రాజవరం చేరుకునేసరికి ఆ గ్రామానికి సుమారు 200 మంది తరలి వచ్చారు. డిప్యూటీ సిఎంను కలవకుండా పోలీసులు వారిని అడ్డగించడంతో గామస్తులు రహదారిపైనే బైఠాయించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తిమ్మన్నకుంట, గంగన్నగూడెం, సీలింగులు, కృష్ణంపాలెం, గవరవరం గ్రామాల మధ్య ఉన్న దాదాపు తొమ్మిది కిలోమీటర్ల రహదారి గత 20 సంవత్సరాలుగా వేయలేదంటూ ఆయా గ్రామస్తులు పవన్‌ను కలిసేందుకు వచ్చారు. వీరిని సైతం పోలీసులు అడ్డగించారు. దీంతో వారంతా అక్కడే ఉండి నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ తిరుగు ప్రయాణంలో ఆయా గ్రామస్తుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి రోడ్లు త్వరిగతిన వేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం తరహాలో డిప్యూటీ సిఎం పవన్ పర్యటనలోనూ పోలీసులు గ్రామాల్లో బారికేడ్లు నిర్మించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రోడ్డుమార్గం గుండా రాజవరం చేరుకున్న డిప్యూటీ సిఎం రూ.1.5 కోట్లతో మరమ్మతు చేసిన లక్కవరం - పొంగుటూరు రోడ్డును పరిశీలించారు. అనంతరం రాజవరంలో కారుదిగి పవన్‌కల్యాణ్ కొంతదూరం పాదయాత్రగా నడిచారు. జనం పెద్దఎత్తున రావడంతో తోపులాట జరిగి మళ్లీ కారులోకి వెళ్లి ప్రయాణం సాగించారు. ఐఎస్.జగన్నాథపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారి నుంచి గుడిపైకి రూ.3.70 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డుకు, ఆలయంలో రూ.3.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన ప్రదక్షిణ మండపానికి శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన 30 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను ఆలయ అధికారులకు అందించారు. రాజవరం గ్రామంలో 60 మీటర్ల పొడవున నియమించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను పవన్‌కల్యాణ్ పరిశీలించారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా రాజమండ్రి చేరుకున్నారు. డిప్యూటీ సిఎం తన పర్యటనలో ఎక్కడా మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు మద్దిపాటి వెంకటరాజు, బొమ్మిడి నాయకర్, చిర్రి బాలరాజు, బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, పులపర్తి ఆంజనేయులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పెనుమల్లి మధు

కార్పొరేట్లకు అమరావతి తాకట్టు

- సిపిఎం నేత పెనుమల్లి మధు ధ్వజం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి నగరాన్ని రూ.66,350 కోట్ల ఖర్చుతో నిర్మించి కార్పొరేట్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాకట్టు పెడుతున్నారని, రాష్ట్రాన్ని అదానీప్రదేశ్‌గా మార్చేస్తున్నారని సిపిఎం మాజీ పార్లమెంట్ సభ్యులు పెనుమల్లి మధు ఆగ్రహం వ్యక్తపర్చారు. తిరుపతి యశోదానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో సోమవారం ఉదయం పెనుమల్లి మధు మీడియాతో మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర ప్రజా సౌకర్యాలు అన్నింటినీ ప్రైవేట్ సంస్థలకు అప్పజెబుతూ రాష్ట్రానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నారని విమర్శించారు. బకాయిలు చెల్లించమని విద్యాసంస్థల యాజమాన్యాలు అడిగినందుకు వారిని బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. 6,400 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపేయడం వల్ల 60 డిగ్రీ కాలేజీలు మూతబడ్డాయన్నారు. మరిన్ని కాలేజీల మూసివేతకు సిద్ధమవుతున్నాయన్నారు. ఈ కారణంగా 14 లక్షల మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులు నష్టపోతున్నారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో వంద రోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని ప్రకటన చేసిన మంత్రి లోకేష్ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ పథకానికి మూడువేల కోట్ల బకాయిలు పెట్టారని, ఈ కారణంగా ఆస్పత్రులు 1300 రకాల జబ్బులకు వైద్యం చేయలేమని తీర్మానించిన విషయాన్ని గుర్తు చేశారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బిజెపితో అంటకాగుతూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని, ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టకపోతే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర పాల్గొన్నారు.

సిఎం వద్దకు చర్చలకు వెళ్లాలంటే.. ఆందోళన విరమించాల్సిందే..

- బల్క్‌డ్రగ్ పార్కు వ్యతిరేక మత్స్యకారులతో హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

బల్క్ డ్రగ్ పార్కు సమస్యపై సిఎం చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లి చర్చలు జరపాలంటే.. ఆందోళన విరమించాల్సిందేనని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మత్స్యకారులకు తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆర్‌డిఒ వివి రమణ, తహశీల్దార్ నరసింహమూర్తి, డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ జె మురళి, మత్స్యకారుల కమిటీ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ 72 రోజుల నుండి మత్స్యకారులు రిలే దీక్షలు చేపడుతున్నారని, వేటకు వెళ్లకపోవడం వల్ల పడుతున్న ఇబ్బందులు తనకు తెలుసునని అన్నారు. రాజయ్యపేట మత్స్యకారులు అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని, అందుకే ఆందోళన చేపట్టిన 16వ రోజుకే గ్రామానికి వచ్చానని చెప్పారు. రెచ్చగొట్టే వారిని నమ్మవద్దన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు చర్చలకు వెళ్లే ముందు ఆందోళన విరమించి వెళితే ఆయనకు గౌరవంగా ఉంటుందన్నారు. సిఎంతో చర్చలు జరిపిన తర్వాత నచ్చకపోతే మరలా యధావిధిగా ఆందోళన కొనసాగించుకోవచ్చునని తెలిపారు. దీనిపై మత్స్యకారులు కొంతమంది అంగీకారం తెలిపారు. కొంతమంది వ్యతిరేకించారు. ఆందోళన కొనసాగిస్తూ సిఎంతో చర్చలు జరిపితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సమావేశ అనంతరం తిరిగి రాజయ్యపేటలోని ఆందోళన శిబిరానికి చేరుకున్న మత్స్యకారులు అక్కడ సమావేశమయ్యారు. పలు విషయాలపై చర్చించారు. మంత్రి అనిత సూచన మేరకు తాము తాత్కాలికంగా మంగళవారం నుంచి దీక్షలను విరమిస్తామని, ముఖ్యమంత్రితో చర్చలు విఫలమైతే యధావిధిగా రిలే దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు. ఇదే విషయమై సాయంత్రం తహశీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు.

21 నుంచి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

- జెవివి అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యాన వచ్చే నెల 21 నుంచి 23వ తేదీ వరకూ కాకినాడ జెఎన్‌టియులో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ సమాజ ఏర్పాటు లక్ష్యంగా ఏర్పడిన జన విజ్ఞాన వేదిక గత 35 ఏళ్లుగా తెలుగు విద్యార్థుల కోసం ప్రతియేటా చెకుముకి సైన్స్ సంబరాలను పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కాకినాడలో వచ్చే నెలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ సంబరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విభాగాల్లో మొదటి స్థానం సాధించిన టీమ్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్య, ఆరోగ్య, పర్యావరణ, వైద్య రంగాలకు చెందిన ప్రముఖులు, అధికారులు అతిథులుగా హాజరవుతారని చెప్పారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రాత పరీక్షతోపాటు క్విజ్, ఎక్స్పెరిమెంట్ రౌండ్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓషనోగ్రఫీ, ఇస్రో, ప్రముఖ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌కు చెందిన శాస్త్రవేత్తలతో ముఖాముఖి, వ్యాసరచన, విజ్ఞాన-వినోద యాత్ర వంటి అంశాలు సంబరాల్లో ప్రత్యేకతగా ఉంటాయని వివరించారు. ఈ సమావేశంలో ఉపాధి, శిక్షణ శాఖ మాజీ ఆర్‌జెడి వి తోడర్మల్, ఎఎన్‌యు అధ్యాపకులు ఎస్ లెనిన్ బాబు, సన్ ఆర్గనైజేషన్ కోశాధికారి కె యశ్వంత్, ప్రైవేటు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ సూర్యారావు, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు శోభన్ బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేదనే పేరుతో తిరస్కరణ

- కొనుగోలు కేంద్రం వద్ద పత్తి రైతుల ఆందోళన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నాణ్యత లేదనే సాకుతో పత్తిని సిసిఐ అధికారులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆగ్రహించారు. నంద్యాల జిల్లా కేంద్రం అయ్యాలూరు మెట్టవద్ద ఉన్న మురారి కాటన్ మిల్లు వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వేల రూపాయలు ఖర్చు పెట్టి కొనుగోలు కేంద్రం వద్దకు పత్తిని తీసుకువస్తే తేమ అధికంగా ఉందంటూ కొనుగోలుదారులు, అధికారులు కొనుగోలు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిసిఐ ద్వారా జిల్లాల్లోని పత్తిని కొనుగోలు చేస్తామని మార్కెటింగ్ అధికారులు ప్రకటనలు చేసినప్పటికీ నాణ్యత లేదంటూ కొనుగోలు చేయకపోవడం అన్యాయమన్నారు. అధికారుల తీరు సరైంది కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలు చేయకుంటే కొనుగోలు కేంద్రంలో కార్యకలాపాలను అడ్డుకుంటామని పలువురు రైతులు హెచ్చరించారు. దీంతో మురారి కాటన్ మిల్లు వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న జిల్లా మార్కెటింగ్ అధికారి మిల్లు వద్దకు చేరుకొని రైతులతో చర్చించారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. 12 శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా రైతులు చూసుకోవాలని సూచించారు.

మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న పత్తి రైతులు

గృహ రుణాల్లో ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు భళా..!

- 50 శాతానికి పెరిగిన మార్కెట్ వాటా
- క్రిఫ్ హై మార్క్ రిపోర్ట్

న్యూఢిల్లీ : గృహ రుణాల్లో ప్రయివేటు రంగ బ్యాంక్‌లు అధిక వడ్డీ రేట్లను వసూలు చేయడంతో రుణగ్రహీతలు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ విభాగం రుణాల మార్కెట్‌ల్లో ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల మార్కెట్ వాటా 50 శాతానికి చేరిందని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. ఇటీవల ఆర్‌బిఐ వరుసగా తగ్గించిన వడ్డీ రేట్లను ఖాతాదారులకు బదిలీ చేయడంలో ప్రయివేటు విత్త సంస్థలు సరిగ్గా స్పందించకపోవడంతో రుణగ్రహీతలు పిఎస్‌బిలను ఆశ్రయించి ఉండొచ్చని తెలుస్తోంది. తీవ్ర పోటీ కలిగిన ఈ రుణ మార్కెట్‌లో ప్రయివేటు రంగ బ్యాంక్‌లను ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు అధిగమించాయని క్రెడిట్ బ్యూరో సంస్థ క్రిఫ్ హై మార్క్ సోమవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. సెప్టెంబర్ నాటికి కొత్తగా జారీ చేయబడిన మొత్తం గృహ రుణాల విలువలో పిఎస్‌బిల వాటా 50 శాతానికి చేరుకుందని తెలిపింది. ఆ రిపోర్ట్ వివరాలు.. గృహ రుణాల జారీలో ప్రయివేటు రంగ బ్యాంకులను పిఎస్‌బిలు అధిగమించి మార్కెట్ లీడర్‌షిప్‌ను సాధించాయి. మొత్తం గృహ రుణాల మార్కెట్ సెప్టెంబర్ చివరి నాటికి రూ.42.1 లక్షల కోట్లకు చేరుకుంది. ఏడాదికేడాదితో పోల్చితే 11.1 శాతం పెరుగుదల నమోదయ్యింది.

మొత్తం యాక్టివ్ రుణాల సంఖ్య స్వల్పంగా పెరగడంతో పాటుగా సగటు రుణ మొత్తం పెరిగింది. దాదాపు 40 శాతం గృహ రుణాలు రూ.75 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగినవిగా ఉండటం విశేషం. మొత్తం వినియోగ రుణాల విభాగం 15.3 శాతం పెరిగి రూ.109.6 లక్షల కోట్లకు చేరుకుందని క్రిఫ్ హై మార్క్ తెలిపింది. "ఈ విభాగంలో బంగారంపై రుణాలు వేగవంతమైన వృద్ధిని సాధించాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు విలువ, సంఖ్యలోనూ తమ మార్కెట్ ఆధిపత్యాన్ని పెంచుకున్నాయి. భౌగోళికంగా జనాభా విభాగాలలో మరింత బాధ్యతాయుతంగా విస్తృత ఆధారిత ఆర్థిక సాధికారతను ప్రోత్సహించాయి." అని క్రిఫ్ హై మార్క్ ఛైర్మన్ సచిన్ సేథ్ పేర్కొన్నారు.

గడిచిన సెప్టెంబర్ ముగింపు నాటికి కన్స్యూమర్ డ్యూరెబుల్స్ రంగం రుణాల జారీలు మందగించి.. 10.2 శాతం పెరుగుదలతో సరిపెట్టుకున్నాయని ఆ సంస్థ పేర్కొంది. మొండి బాకీలు, ఆస్తి నాణ్యత అంశంలో వినియోగ రుణాలలో 31-180 రోజులు బకాయి ఉన్న రుణాల నిష్పత్తి జూన్‌లో 3.1 శాతంగా ఉండగా.. సెప్టెంబర్‌లో 3 శాతానికి తగ్గగా.. గతేడాది సెప్టెంబర్‌లో ఇది 3.3 శాతంగా ఉందని ఆ సంస్థ తెలిపింది.

జెసికి అవిశ్వాస నోటీసులు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

'ఈ మేయర్ మాకొద్దు'

- 40 మంది కార్పొరేటర్లు వినతి
- జెసికి అవిశ్వాస నోటీసు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

'మేయర్ స్రవంతి మా కొద్దు' అంటూ 40 మంది కార్పొరేటర్లు కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. సోమవారం టిడిపికి చెందిన కార్పొరేటర్లు నెల్లూరు మేయర్ పొట్లూరు స్రవంతికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. మేయర్ స్రవంతి ఎన్నికై సోమవారానికి నాలుగు సంవత్సరాలు పూర్తయింది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమెను తొలగించడానికి టిడిపి సిద్ధమైంది. ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిన మంత్రి పి.నారాయణ, ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో కార్పొరేటర్లు సంతకాలు చేసి, అవిశ్వాస తీర్మాన నోటీసులు తీసుకొని ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వచ్చారు. జెసిని కలిసి నోటీసులు అందజేసి, సమావేశమై, ఆమెను తొలగించాలని కోరారు. టిడిపి నేత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో కార్పొరేటర్లు వెళ్లారు. నాలుగు సంవత్సరాల కాలంలో మేయర్ కేవలం ఏడు కౌన్సిల్ సమావేశాలు మాత్రమే నిర్వహించారని, ప్రజల విశ్వాసం మేయర్ ఎప్పుడో కోల్పోయారని, మేయర్ పదవి అడ్డంపెట్టుకొని ఆమె భర్త జయవర్ధన్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, క్రిమినల్ కేసులు ఎదుర్కొని, జైలుకు వెళ్లారని పేర్కొన్నారు. కార్పొరేషన్‌ను గాడిలో పెట్టేందుకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని, నూతన మేయర్‌ను ఎన్నుకుంటామని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీ

- విజేతలుగా బాలికల విభాగంలో తూర్పు గోదావరి, బాలుర విభాగంలో నెల్లూరు

బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

నక్కపల్లిలోని హాకీ క్రీడా మైదానంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న బాల బాలికల అండర్ - 19 రాష్ట్ర స్థాయి హాకీ క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. 13 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాలికల విభాగంలో తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల జట్లు తలపడగా 2-1తో తూర్పు గోదావరి జిల్లా జట్టు విజయం సాధించి ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ద్వితీయ స్థానంలో విశాఖపట్నం నిలిచింది. తృతీయ స్థానం కోసం అనంతపురం - చిత్తూరు జిల్లాల జట్లు పోటీ పడగా 2-1తో అనంతపురం విజయం సాధించింది. బాలుర విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు - తూర్పుగోదావరి జట్లు పోటీ పడగా 3-0తో నెల్లూరు జట్టు విజయం సాధించి ప్రథమ స్థానంలోనూ, తూర్పుగోదావరి ద్వితీయ స్థానంలోనూ నిలిచాయి. తృతీయ స్థానం కోసం విశాఖపట్నం - కడప జిల్లాల జట్లు పోటీ పడగా 2-0తో విశాఖపట్నం జట్టు విజయం సాధించింది. విజేత జట్లకు అతిథులు ట్రోఫీలు, జ్ఞాపికలు అందజేశారు.

అంతర్జాతీయ నిపుణులతో సలహా మండలి

- వైద్య ఆరోగ్య శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు 10 మంది అంతర్జాతీయ నిపుణులతో ఉన్నత స్థాయి సలహా మండలిని ప్రభుత్వం నియమించినట్లు వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు వివరించగా ఆయన సోమవారం ఆమోదం తెలిపినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న 10 వ్యాధులకు సంబంధించి ఒక్కో వ్యాధికి సలహా మండలిని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. వ్యాధుల వారీ ప్రణాళికలు రూపొందించి ఆయా వ్యాధుల భారాన్ని తగ్గించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపింది. ఆధునిక సాంకేతికతో మెరుగైన వైద్య సేవల్ని అందించడానికి గేట్స్ ఫౌండేషన్, టాటా ఎమ్‌డి, ఐఐటి చెన్నై, స్వస్థి వంటి సంస్థల భాగస్వామ్యంతో పలు ప్రణాళికలు అమలవుతున్నాయని, వీటితోపాటు పలు ఇతర కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ నిపుణుల సలహా మండలిలో సర్ పీటర్ పయట్, డాక్టర్ సౌమ్య స్వామినాథన్, ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టేవ్, డాక్టర్ గగన్ దీప్ ఖాన్, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, ప్రొఫెసర్ మార్గరెట్ ఎలిజిబెత్ క్రుక్, డాక్టర్ నిఖిల్ టాండన్, రిజ్వాన్ కొయిట, శ్రీకాంత్ నాదముని, మిస్ ఆర్తి అహుజా ఉన్నారని వెల్లడించింది.

పైలట్ల శిక్షణ వ్యాపారంలోకి అదానీ గ్రూప్..!

ముంబయి : అదానీ గ్రూప్ విమానయాన రంగంలోని అన్ని అవకాశాలను చేజిక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా తమ అనుబంధ సంస్థ అయిన డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ద్వారా పైలట్లకు శిక్షణనిచ్చే సంస్థను ప్రారంభించేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఈ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటిగా ఉన్న ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్‌టిఎస్‌సి)ని కొనుగోలు చేసేందుకు అదానీ గ్రూప్ సిద్ధంగా ఉందని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ కంపెనీకి గూర్‌గావ్, హైదరాబాద్, ముంబయిలో సిమ్యులేటర్ సెంటర్లు ఉన్నాయి. హరియాణా, సూరత్, సోలాపూర్‌లో శిక్షణా కేంద్రాలు ఉన్నాయి. ప్రైమ్ ఏరో, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ మధ్య 50:50 జాయింట్ వెంచర్‌గా ఉన్న 'హోరైజాన్ ఏరో సొల్యూషన్స్' ద్వారా ఈ కొనుగోలును చేపట్టనుందని తెలుస్తోంది.

సెన్సెక్స్ 331 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలను చవి చూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సోమవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 331.21 పాయింట్లు లేదా 0.39 శాతం పతనమై 84,900.71కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 108.65 పాయింట్లు లేదా 0.42 శాతం నష్టంతో 25,959.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో బిఇఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, టాటా మోటార్స్ పివి, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా షేర్లు అధికంగా లాభపడ్డాయి.

సామ్‌సంగ్ నుంచి ఆర్20 అల్ట్రాసౌండ్ సిస్టమ్

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ కంపెనీ కొత్తగా ఆర్20 అల్ట్రాసౌండ్ సిస్టమ్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. దీనిని నెక్స్ట్ జెన్ ఎఐతో జనరల్ ఇమేజింగ్‌తో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఇది క్లినికల్ అప్లికేషన్లలో అత్యుత్తమ ఇమేజ్ క్లారిటీ, మెరుగైన కాంట్రాస్ట్, డయాగ్నొస్టిక్ ఖచ్చితత్వాన్ని అందిస్తుందని సామ్‌సంగ్ ఇండియా హెచ్ఎంఇ బిజినెస్ హెడ్ అటంత్ర దాస్ గుప్తా పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన డాప్లర్ సున్నితత్వం, రంగు ప్రవాహ విజువలైజేషన్ వైద్యులకు సూక్ష్మ వాస్కులర్ నిర్మాణాలు, పాథాలజీలను మరింత ఖచ్చితత్వంతో గుర్తించడానికి వీలు కల్పిస్తుందన్నారు.

సంపాదకీయం

దుర్మార్గం

కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల ప్రజాస్వామిక హక్కులపై ఏకపక్ష దాడి కాగా, కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారుల దోపిడీకి వాటంగా నిలుస్తాయి. స్వాతంత్య్రానికి పూర్వంనుండి కార్మికులు ప్రభుత్వాలపై సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను విదేశీ, విదేశీ కేపిటలిస్టులకు అనుకూలంగా సరళీకరించి నాలుగు 'స్మృతు'లు కింద కుదించేందుకు మోడీ సర్కార్ కసరత్తు ప్రారంభించింది మొదలు కార్మిక లోకం తీవ్రంగా నిరసిస్తూ వచ్చింది. ముసాయిదాల సమయంలోనూ ఆందోళనలు వెల్లువెత్తాయి. తొలుత 2019లో వేతనాల కోడ్ తీసుకొచ్చినప్పుడు కార్మికుల సమ్మెలు, హర్తాళ్లతో దేశం స్తంభించింది. అయినా వెనక్కి తగ్గకుండా 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లను వరుసగా తీసుకొచ్చింది. కార్మికుల ఆందోళనలను లెక్క చేయకుండా, కనీసమాత్రం కార్మిక సంఘాలతో సంప్రదించకుండా, హఠాత్తుగా శుక్రవారం నుంచి నాలుగు లేబర్ కోడ్‌ల తక్షణ అమలుకు నోటిఫికేషన్ జారీ చేయడం కార్మికుల హక్కులను కాలరాయడమే. బీహార్ ఎన్నికల తర్వాత ఈ పని చేయడం బిజెపి రాజకీయ ఎత్తుగడే.

తాము తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ప్రగతిశీల బాట వేస్తాయని, ఆర్థిక పురోగతి సాధిస్తాయని మోడీ ప్రభుత్వ పటాలం సమర్ధించుకోవడం వంచన. కోడ్స్‌లో ఎక్కడా కార్మిక సంక్షేమం కనిపించదు. ఆసాంతం కార్మిక భక్షణ, శ్రమ దోపిడీ, హక్కుల హననం కనిపిస్తుంది. వేతనం నిర్వచనాన్నే మార్చేశాయి. కరువు భత్యం, బోనస్, ఇంటి అద్దె అలవెన్స్ వంటి వాటిని మినహాయించాయి. గ్రాట్యుటీ, రిట్రెంచ్‌మెంట్ పరిహారం అనేవి లేవు. ఒక సంవత్సరానికే గ్రాట్యుటీ అని చెప్పినా, నిర్దిష్ట కాలానికి నియమించుకున్న కొత్త ఉద్యోగులకే అది వర్తిస్తుంది. కార్మికులు తమ డిమాండ్ల కోసం సమ్మె చేసే హక్కుకు పరిమితులు విధిస్తున్నాయి లేబర్ కోడ్స్‌తో పనిగంటలు పెరుగుతాయి. కాంట్రాక్టు, వలస కార్మికుల హక్కులను బలహీనపరుస్తున్నాయి. ఈ విధంగా కార్మికుల ప్రాథమిక హక్కులను తిరస్కరించడం రాజ్యాంగ విరుద్ధం. కార్మిక శాఖ అధికారులను కొత్త చట్టాలు ఫెసిలిటేటర్లుగా మార్చడం ఆందోళనకరం. కోడ్స్‌లో వేతనాలను నిర్ణయించలేదు. గిగ్ వర్కర్లను, మహిళలను, అసమానతలను, అసంఘటిత కార్మికులను పరిగణనలోకి తీసుకోనట్లే కనిపిస్తుంది. సామాజిక భద్రత కోడ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు గందరగోళంగా ఉన్నాయి. రాష్ట్రాల పరిధిలోని అంశంలోకి కేంద్రం చొరపడటం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం.

లేబర్ కోడ్స్‌ను ఖండిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు పెల్లుబకగా, తమ కోడ్స్ విప్లవాత్మక సంస్కరణలుగా ప్రధాని మోడీ పేర్కొని తన కార్మిక వ్యతిరేకతను చాటుకోవడం దుర్మార్గం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత వేగవంతం చేయడానికి లేబర్ 'సంస్కరణ'లు ఉపయోగపడతాయని, పెట్టుబడుల ఆకర్షణకు తోడ్పడతాయన్న మోడీ స్పందనను బట్టే కోడ్స్ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం తెచ్చినవని స్పష్టమవుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మరో అడుగు ముందుకేసి, 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత లేబర్ కోడ్స్ అనేవి పెద్ద సంస్కరణలనడం ద్వారా కార్పొరేట్ల ఊడిగానికి జై కొట్టినట్లయింది. ఇప్పటికే 10-12 కు పనిగంటల పెంపు, రాత్రి వేళల్లో మహిళలతో పని చేయించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ చట్టాలను సవరించారు. లేబర్ కోడ్స్ వలన కార్మికులకు భద్రత లేక సమాజంలో అశాంతి నెలకొంటుంది. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. నిరుద్యోగం, పేదరికం, ద్రవ్యోల్బణం పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో దేశ ఆర్థిక పురోగతి, ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ సాధన ఏ విధంగా సాధ్యమవుతుందో మోడీ ప్రభుత్వం చెప్పాలి. కార్మికులకు హానికరంగా మారిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికలోకం కదలాలి. కార్మిక సంఘాల పిలుపునందుకొని ఈ నెల 26న జరిగే ఆందోళనల్లో పాల్గొని కార్మిక సత్తా చాటాలి. ఈ ఆందోళనలకు అన్ని వర్గాల ప్రజలూ మద్దతుగా నిలిచి వీరోచిత రైతాంగ పోరాటం స్ఫూర్తి కనబరిచి లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకొనేలా మోడీ ప్రభుత్వం మెడలు వంచాలి.

మహనీయుల మాట



మన పాఠ్యగ్రంథాలు యుద్ధాల్ని కీర్తిస్తాయి. వాటి దుర్మార్గాల్ని దాచిపెడతాయి. అవి మన పిల్లల హృదయాల్ని విద్వేషమయం చేస్తాయి. నేనైతే...యుద్ధాన్ని కాదు, శాంతిని బోధిస్తాను. ద్వేషాన్ని కాదు, ప్రేమను వారిలో నింపుతాను.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

Albert Einstein

చట్టా వ్యాపారం - సుంకాలు - శ్రామిక ప్రజానీకం

మార్కెట్లో ఒకానొక సరుకుకు కొరత ఏర్పడినప్పుడు ఆ సరుకును అక్రమంగా దాచిపెట్టి ఆ కొరతను మరింత పెంచేలా చట్టా వ్యాపారులు చేయగలరు. ఒక్కోసారి ఏ కొరతా లేకపోయినప్పటికీ, కృత్రిమంగా కొరత సృష్టించగలరు కూడా. ఆ సరుకు గనుక నిత్యావసర సరుకు అయితే ఇక శ్రామిక ప్రజానీకం చట్టా వ్యాపారం వలన పడే ఇబ్బందులు ఇన్నీ అన్నీ కావు. ఈ విషయం తెలిసినదే. 1943లో యుద్ధ సమయంలో తూర్పు సరిహద్దులో యుద్ధం జరుగుతున్నప్పుడు ఆ యుద్ధానికి అయ్యే ఖర్చు కోసం బడ్జెట్ లోటును విపరీతంగా పెంచారు. ఆ సమయంలో ఆహార ధాన్యాల కోసం మార్కెట్లో డిమాండ్ బాగా పెరిగింది. సరిగ్గా అప్పుడే టోకు (హోల్‌సేల్) వ్యాపారులు ఆహార ధాన్యాలను నల్ల బజారుకు తరలించారు. దాని పర్యవసానంగా బెంగాల్ కరువు ఏర్పడింది. దానివలన 30 లక్షల మంది చనిపోయారు. ఐతే, ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలు అంతకన్నా ఎక్కువగా నష్ట పరుస్తున్నాయి. కేవలం నిత్యావసర సరుకుల విషయంలో జరిగే చట్టా వ్యాపారం ద్వారా మాత్రమే దెబ్బ తీయడంతో సరిపెట్టకుండా, కరెన్సీ మార్కెట్లో జరిగే చట్టా వ్యాపారం ద్వారా నేరుగానే శ్రామిక ప్రజల కొనుగోలుశక్తిని దెబ్బ తీస్తున్నాయి.

ప్రభాత్ పట్నాయక్

నయా ఉదారవాద వ్యవస్థలో పెట్టుబడుల రాకపోకల మీద, ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి రాకపోకల మీద ఎటువంటి నియంత్రణలూ లేవు. ఒక దేశపు కరెన్సీకి అంతర్జాతీయ మార్కెట్లో ఉండే మారకపు విలువను ఇప్పుడు మార్కెట్ మాత్రమే నిర్ణయిస్తుంది. అప్పుడు చట్టా వ్యాపారులు ఒక దేశంలో అమెరికన్ డాలర్ల రూపంలో ఉన్న వారి పెట్టుబడులను వేరే దేశానికి తరలించాలని నిర్ణయించారనుకోండి. దాని ఫలితంగా ఆ దేశపు కరెన్సీ మారకపు రేటు పడిపోతుంది. దాని పర్యవసానంగా ఆ దేశం దిగుమతి చేసుకునే సరుకుల రేట్లు ఆ దేశపు కరెన్సీ లెక్కలో పెరిగిపోతాయి. అలా దిగుమతి చేసుకునే సరుకులు గనుక చమురు వంటి నిత్యావసర సరుకులు అయితే దాని ఫలితంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ మీద ఆర్థిక భారం మొత్తంగానే పడుతుంది. అది ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. దానివలన నిజ వేతనాలు పడిపోతాయి. కష్టపడి జీవించే వారందరి నిజ ఆదాయాల విలువలు పడిపోతాయి. ఎక్కువమంది శ్రామిక ప్రజల ఆదాయాలు జీవన వ్యయ సూచికతో ముడిపడి వుండవు. అందువలన వారి నిజ ఆదాయాల్లో కోత మరీ తీవ్రంగా ఉంటుంది. పపంచవ్యాప్తంగా న్న కోట్లాదిమంది శ్రామిక ప్రజల జీవన పరిస్థితులు దురాశాపూరితులైన కొద్దిమంది స్పెక్యులేటర్ల (చట్టా వ్యాపారుల) దయా దాక్షిణ్యాలమీద ఆధార పడివున్నాయి. ఇదే నయా ఉదారవాద వ్యవస్థ వాస్తవ లక్షణం.

> **రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయడం వలన దేశంలో చమురు ఉత్పత్తుల (పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్) ధరలు పెరుగుతాయి. రష్యా నుండి చమురు మనకి చౌకగా లభించేది. ఇప్పుడు దానిని కొనడం మానేస్తే అంతర్జాతీయ చమురు ధరల స్థాయి ప్రకారం చమురు దిగుమతులకు మనం చెల్లించుకోవాలి. దానివలన ధరలు పెరుగుతాయి. అంతేకాదు; ప్రపంచ మార్కెట్లో ముడిచమురు సరఫరా తగ్గుతుంది.**



పెట్టుబడులు ఉన్నట్టుండి బైటకు పోయినప్పుడు మన కరెన్సీ మారకపు విలువ పడిపోయి, దిగుమతుల ఖరీదు పెరిగిపోయి, శ్రామిక ప్రజల నిజ ఆదాయాలు దెబ్బ తినడం జరిగినట్టే, దానికి రివర్స్‌లో జరిగితే ఏమౌతుంది? మన దేశంలోకి పెట్టుబడులు ఎక్కువగా వచ్చి, మన కరెన్సీ మారకపు విలువ పెరిగిపోయి శ్రామిక ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడతాయా? అలా జరగదు.

దేశంలోకి పెట్టుబడులు ఎక్కువగా వచ్చిపడినప్పుడు మన కరెన్సీ మారకపు విలువను పెరగనిస్తే- అప్పుడు దిగుమతుల ద్వారా వచ్చే సరుకుల కన్నా దేశీయంగా చేసే ఉత్పత్తులు ఎక్కువ ప్రియం అవుతాయి. అప్పుడు దేశంలో ఉత్పత్తి తగ్గుతుంది. దిగుమతులు పెరుగుతాయి. అలా దిగుమతులు పెరిగితే వాటికోసం చెల్లించవలసిన విదేశీ మారక ద్రవ్యం (డాలర్లు) ఎక్కువ అవసరమౌతుంది. రిజర్వు బ్యాంకు గనుక జోక్యం చేసుకోనట్లయితే- అప్పుడు మన దేశం విదేశీ మదుపరులకు బకాయి పడిపోతుంది. అది కూడా తన దేశంలో పరిశ్రమల్ని మూత వేసుకోవడం కోసం. ఇంతకన్నా అర్థరహితమైన పరిణామం మరొకటి ఉండదు. అందుచేత రిజర్వు బ్యాంకు తప్పనిసరిగా జోక్యం కల్పించుకుంటుంది. మన రూపాయి మారకపు విలువను పెరగనివ్వకుండా చర్యలు తీసుకుంటుంది. అందుకోసం విదేశాలనుండి వచ్చే అదనపు డాలర్లను తన విదేశీమారకపు నిల్వలలోకి మళ్ళిస్తుంది. అంటే, మన దేశం నుండి డాలర్లు బైటకు పోతే శ్రామిక ప్రజల నిజ ఆదాయాలు దెబ్బ తింటాయి. అదే మన దేశానికి డాలర్లు అదనంగా వస్తే వాటిని రిజర్వు బ్యాంకు భద్రంగా విదేశీమారకపు నిల్వలుగా దాచి మన రూపాయి మారకపు విలువ పెరగకుండా చూస్తుంది.

విదేశీ మారకపు నిల్వలు ఎక్కువగా ఉంటే మంచిదే కదా? ఉన్నట్టుండి మన దేశం నుంచి డాలర్లు బైటకు పోయే పరిస్థితి ఏర్పడినప్పుడు ఆ నిల్వలను విడుదల చేసి మన రూపాయి విలువ పడిపోకుండా నిలబెట్టవచ్చు కదా? ఈ వాదన సరైనదే. కాకపోతే ఇక్కడ ఒక సమస్య ఉంది. రిజర్వు బ్యాంకు తన నిల్వలనుండి డాలర్లను విడుదల చేయడానికి సిద్ధపడినా, దానికి పరిమితి ఉంటుంది. తనవద్ద ఉన్న నిల్వలు అన్నీ ఖాళీ అయిపోయే పరిస్థితిని రానివ్వదు. అంటే రిజర్వు బ్యాంకు విడుదల చేసే విదేశీ మారకద్రవ్య పరిమాణానికి కొంత పరిమితి ఉంటుంది. దానివలన డాలర్లు మన దేశం నుండి బైటకు పోయే స్థితి వచ్చినప్పుడు దాని వలన కలిగే లోటును రిజర్వు బ్యాంకు పూర్తిగా భర్తీ చేయలేదు. అందు వలన రూపాయి మారకపు విలువ పూర్తిగా పడిపోకుండా నిలవరించలేదు. కొంతవరకే దానిని ఆపుతుంది. మారకపు విలువ కొంతవరకూ పడిపోతూ వుంటుంది. కొంతవరకు విదేశీ నిల్వలను రిజర్వు బ్యాంకు విడుదల చేస్తూ వుంటుంది. మొత్తం మీద క్రమంగా రూపాయి మారకపు విలువ పడిపోతూ వుంటుంది. శ్రామిక ప్రజల నిజ ఆదాయాలు తగ్గిపోతూ వుంటాయి. భారతదేశంలో ఇటీవల కాలంలో ఇదే జరుగుతూ వస్తోంది.

కొంత కాలం గడిచేసరికి వెనక్కి తిరిగి చూసుకుంటే రూపాయి మారకపు రేటు పడిపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 1990 నవంబర్ 10న చంద్రశేఖర్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచీ సరళీకరణ క్రమం మొదలైంది. అప్పుడు రూపాయి మారకపు విలువ చూస్తే ఒక డాలర్‌కు రు.17.50గా ఉంది. అదే 2025 నవంబర్ 15 నాటి పరిస్థితి చూస్తే ఒక డాలర్ విలువ రు. 88.50గా ఉంది. అంటే నయా ఉదారవాద దశలో రూపాయి మారకపు రేటు భారీగా పడిపోయింది. ఏకంగా 400 శాతం పడిపోయింది. అదే 1947 నుంచి 1990 వరకూ ఉన్న కాలంలో చూస్తే కేవలం 33.3 శాతం మాత్రమే రూపాయి మారకపు విలువ పడిపోయింది.

మూడవ ప్రపంచ దేశాలకు నయా ఉదారవాదం కలిగించే అనివార్యమైన పరిణామం ఇది. ఐతే దీనికి తోడు మరొక పద్ధతి ద్వారా కూడా మన దేశ ఆర్థిక వ్యవస్థను నయా ఉదారవాద వ్యవస్థ ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇప్పుడు ట్రంప్ సాగిస్తున్న సుంకాల యుద్ధం అదే. సామ్రాజ్యవాద దేశాలన్నీ కట్టగట్టుకుని రష్యా మీద ఏకపక్షంగా ఆంక్షలు విధించినప్పటికీ, వాటిని ధిక్కరించి భారతదేశం రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తోంది కనుక భారతదేశానికి శిక్షగా సుంకాలను భారీగా విధించాడు ట్రంప్. భారతదేశం సాధించిన స్వావలంబనను ఇప్పటికే నయా ఉదారవాద విధానాలు దెబ్బ తీశాయి. ఆ విధానాలను విడిచిపెట్టే ఆలోచన మోడీ ప్రభుత్వానికి లేదు. అమెరికా విధించిన ఏకపక్ష ఆంక్షలకు ప్రతిగా చర్యలు తీసుకోగలిగిన దమ్ము అంతకన్నా లేదు. అందుచేత అమెరికా ఒత్తిళ్ళకు తలొగ్గింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోనని అంగీకరించింది. అలా అంగీకరించినట్టు మన దేశం ఎక్కడా ప్రకటించలేదు కాని ట్రంప్ ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించాడు.

ఇలా రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయడం వలన దేశంలో చమురు ఉత్పత్తుల (పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్) ధరలు పెరుగుతాయి. రష్యా నుండి చమురు మనకి చౌకగా లభించేది. ఇప్పుడు దానిని కొనడం మానేస్తే అంతర్జాతీయ చమురు ధరల స్థాయి ప్రకారం చమురు దిగుమతులకు మనం చెల్లించుకోవాలి. దానివలన ధరలు పెరుగుతాయి. అంతేకాదు; ప్రపంచ మార్కెట్లో ముడిచమురు సరఫరా తగ్గుతుంది. (రష్యా నుండి కొనుగోలు చేయడం మానివేసినందువలన) కాని ప్రపంచ డిమాండ్ యధాతథంగానే కొనసాగుతుంది. అందువలన అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా మన చమురు ఉత్పత్తుల ధరలు మరింత పెరుగుతాయి.

చమురు ధరలు గనుక పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద ఖర్చు పెరిగిపోతుంది. ఆ ఖర్చును తట్టుకోడానికి ప్రభుత్వం శ్రామిక ప్రజల ఆదాయాలను మరింతగా కుదించే చర్యలు తీసుకుంటుంది. రూపాయి మారకపు రేటు పడిపోవడం వలన శ్రామిక ప్రజల నిజ ఆదాయాలు ఏవిధంగానైతే పడిపోతాయో, అదే విధంగా చౌకగా లభించే రష్యన్ చమురు కొనుగోలును ఆపేస్తే, అప్పుడు కూడా వారి నిజ ఆదాయాలు పడిపోతాయి.

అమెరికా ఇప్పుడు రష్యా మీద ఆంక్షలు విధిస్తున్నది కేవలం రాజకీయ కారణాలరీత్యా మాత్రమే కాదు. ప్రపంచ మార్కెట్లో తన స్వంత చమురుకు ఉన్న మార్కెట్‌ను మరింత పెంచుకోడానికి కూడా ఈ ఆంక్షలు తోడ్పడతాయి. అమెరికన్ చమురు ఖరీదు ఎక్కువ. దానిని ఎక్కువగా కొనుగోలు చేయాలంటే చౌకగా లభించే రష్యన్ చమురును మార్కెట్లో కట్టడి చేయాలి. అమెరికా చేస్తున్న ఈ ఒత్తిడికి ఇప్పటికే యూరపియన్ దేశాలు తలలొగ్గాయి. చౌకగా లభించే రష్యన్ చమురుకు బదులు ఖరీదైన అమెరికన్ చమురును కొనుగోలు చేయడానికి అంగీకరించడం ద్వారా ఆ దేశాలు ఒకవిధంగా ఆర్థికంగా ఆత్మహత్యలు చేసుకున్నట్టే. ఇప్పటికే జర్మనీలో పరిశ్రమలు ఒకటొకటిగా మూతపడిపోతున్నాయి. జర్మన్ కార్మికులు గత చలికాలం అంతా రక్షణ లేకుండా నానా ఇబ్బందులూ పడ్డారు. ఇప్పుడు వాళ్ళకి మూడవ ప్రపంచ దేశాల్లోని శ్రామిక ప్రజలు కూడా తోడవుతున్నారు. ఇదంతా కేవలం అమెరికన్ చమురు వ్యాపారుల లాభాలను పెంచడం కోసమే!

తన చమురు మార్కెట్‌ను, తన లాభాలను పెంచుకోవడం కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రామిక ప్రజానీకం త్యాగాలు చేయాల్సిందేనని అమెరికన్ సామ్రాజ్యవాదం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేస్తోందటే- దాని తలపొగరు ఏ స్థాయిలో ఉందో తెలుస్తూనే వుంది. అదే సమయంలో మోడీ ప్రభుత్వం నోరెత్తకుండా అమెరికన్ ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి స్వంత శ్రామిక ప్రజానీకాన్ని బలిపెట్టడానికి తయారైందంటే- ఈ ప్రభుత్వపు చేతకానితనం, స్వంత దేశ ప్రయోజనాలకన్నా అమెరికన్ పెట్టుబడిదారుల ప్రయోజనాలకే పెద్దపీట వేసే దాని నైజం స్పష్టమవుతూనే వున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్స్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్స్‌గా మార్చింది. 2019లో వేతనకోడ్‌ను, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లకు పార్లమెంట్లో ఆమోదం పొందింది. అయినా, గత ఐదేళ్ల నుంచి వాటిని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం చాలలేదు. బీహార్‌లో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లేబర్ కోడ్స్ అమలు చేసే నాలుగు జీఓలను కేంద్ర కార్మిక శాఖా మంత్రి మాన్‌సూఖ్ మాండివ్య ప్రకటించారు. ఈ లేబర్‌కోడ్‌లు కార్పొరేట్లకు అనుకూలం. కార్మికవర్గానికి వ్యతిరేకం.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చింది. ప్రధాని మోడీ లేబర్‌కోడ్‌ల అమలు ఉత్తర్వులను సరళీకరణ విధానాలు అమల్లో భాగంగా అభివర్ణించారు. 'క్రోని కాపిటలిజం' కాలంలో కార్పొరేట్ల అత్యధిక లాభాలు గడించడానికి ప్రస్తుత చట్టాలు ఆటంకంగా ఉన్నాయి. అందుకోసమే ప్రస్తుత 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్‌లుగా కుదించి, అమల్లోకి తెచ్చారు. వాస్తవానికి పాలకవర్గం తమ దయా దాక్షిణ్యాలతో ఏ కార్మిక చట్టాన్ని రూపొందించలేదు. ప్రతి కార్మిక చట్టం వెనుక మహత్తరమైన పోరాటాలు ఉన్నాయి. అశేష త్యాగాల కారణంగా వచ్చిన కార్మిక చట్టాలను చెరుకు బండి రసాన్ని తీసినట్లు సారాన్ని పూర్తిగా తొలగించి, పిప్పినే మిగిల్చారు ఇప్పుడు. కార్మికవర్గం లేబర్‌కోడ్‌ల ద్వారా ఉన్న హక్కులను కోల్పోయింది. ఉన్న ఫళంగా పనిగంటలు పెంచితే కార్మికవర్గం సహించి ఊరుకోదు. ఐక్యంగా పోరాడి తిరిగి చట్టాలను సాధించుకుంటుంది. రానున్న కాలంలో ప్రతిఘటన, పోరాటాలు అనివార్యం.



సిహెచ్.నరసింగరావు

లేబర్‌కోడ్‌ల పేరుతో నిర్వచనాలకే తిలోదకాలిచ్చారు. 'చట్టం' అనే పేరు లేకుండా కోడ్‌గా మార్చారు. ఇన్‌స్పెక్టర్ బదులుగా ఫెలిసిటేటర్ అని రూపాంతరం చేశారు. తనిఖీలు ఉండరాదనే కార్పొరేట్‌ల కోర్కెను ఈ విధంగా తీర్చారు. తనిఖీ లేకుండా ఏ చట్టమైనా అమలు జరుగుతుందా? కార్మిక చట్టాల్లోని జీతం, డీఏ, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ వగైరా ఏ ఒక్క అంశం అమలు జరగకపోయినా- అధికారులు తనిఖీ చేయాలి. ఇది ఇప్పటివరకూ చట్టాలు చేసే మార్గదర్శనం. కాని ఇకముందు యూనియన్లు ఫిర్యాదు చేసినా, కార్మికులు ఫిర్యాదు చేసినా ఎలాంటి తనిఖీలూ ఉండవు. ఇప్పటివరకూ చట్టాలు అమలు చేయకపోతే యజమానికి జైలుశిక్షలు విధించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇకముందు జరిమానాలే గాని జైలు శిక్షలుండవు. అంటే ఏ యజమానికి ఏ భయమూ ఉండదు. ఫలితంగా లేబర్‌కోడ్‌లో ఉన్న అంశాలు కూడా అమలు కావు. ఇప్పటి వరకూ ఉన్న 'ట్రైనీ' అనే పదం కూడా మాయమైంది. దానికి బదులు ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఎన్ని సంవత్సరాలైనా పర్మినెంట్ చేయకుండా పని చేయించుకునే విధానం అమల్లోకి వస్తుంది. పేరు ఏది పెట్టినా కార్మికులను జీవితమంతా పర్మినెంట్ చేయకుండా పని చేయించడమే లేబర్‌కోడ్స్ సారాంశం.

> **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గానికి వ్యతిరేకంగా ఉన్నాయనేది స్పష్టం. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండు చేస్తూ, 2025 నవంబర్ 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా, ముఖ్య కేంద్రాల్లో నిరసన తెలియజేయాలని 11 కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాన్ని యావత్తు కార్మికవర్గం అమలు చేయించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.**

ఇప్పటికే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం లాంటి అనేక తరగతులను కార్మికులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. సామాజిక భద్రత, వృత్తిపర భద్రత కోడ్‌ల పేరుతో కార్మికులందరికీ భద్రత కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం పచ్చి మోసం. బిల్డింగ్, మైన్స్, బీడీ కార్మికులు, జర్నలిస్టులతో సహా ఇన్నేళ్లు పోరాడి సాధించుకున్న భద్రతను ఈ కోడ్స్ కారణంగా కోల్పోతున్నారు.

1996లో వచ్చిన బిల్డింగ్ వర్కర్స్ చట్టం ప్రకారం... భవనాలు, ఇతర నిర్మాణాల యజమానుల నుంచి వసూలు చేసిన సెస్‌ను ఆ రంగాల కార్మికులకు ఖర్చు పెట్టాలి. కానీ, ఇప్పుడు వృత్తిపరమైన రంగాల చట్టాలన్నీ రద్దయిపోతాయి. యజమానుల నుంచి సెస్ వసూలు చేయకుండా వారికి భద్రత ఉండదు. దీనివల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుంది. కార్మికులు సమ్మె చేయకుండా అన్ని విధాల ప్రభుత్వానికి, యాజమాన్యాలకు పారిశ్రామిక సంబంధాల కోడ్ అవకాశం కల్పిస్తుంది. సమ్మె కార్మికుల హక్కు. కార్మికులు పోరాడకుండా ఏ హక్కులూ సాధించుకోలేం. కానీ పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో పేర్కొన్న దాని ప్రకారం... కార్మికులు సమ్మె చేస్తే - ఒక రోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్ అవుతుంది. యూనియన్ నాయకులను జైల్లో పెట్టవచ్చు. యూనియన్ గుర్తింపును, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయవచ్చు. అంటే రానున్న కాలంలో పోరాటాలను అణచాలనే పాలకవర్గాల కుట్రలో భాగమే లేబర్‌కోడ్స్ అమలు. "అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న" అన్నట్లు కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు అమల్లోకి రాకముందే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కార్మిక చట్టాలను అమలు చేయడం లేదు. దీనినే దేశమంతా 'ఈజ్ ఆఫ్ డూయింగ్' బదులు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే నినాదంతో కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ వ్యతిరేకంగా ఉన్నాయనేది స్పష్టం. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండు చేస్తూ, 2025 నవంబర్ 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా, ముఖ్య కేంద్రాల్లో నిరసన తెలియజేయాలని 11 కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాన్ని యావత్తు కార్మికవర్గం అమలు చేయించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.

(రచయిత సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

అభిప్రాయం

ఆత్మహత్యలను నివారించాలి

డిసెంబర్ నెల వచ్చిందంటే విద్యార్థుల్లో పరీక్షల గురించి ఆందోళన ప్రారంభం అవుతుంది. ఒకవైపు సిలబస్ పూర్తి చేసే హడావిడిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు వుంటారు. మరోవైపు వివిధ ప్రవేశ పరీక్షలకు నోటిఫికేషన్స్ విడుదల అవుతుంటాయి. ఇంకోవైపు వివిధ వివిధ కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేసుకునే పనిలో బిజీ అవుతాయి. ర్యాంకులు, మార్కుల ఒత్తిడిలో విద్యార్థులు నలిగి పోతుంటారు. ఫలితంగా కొందరు తీవ్ర నిరాశతో తామెందుకూ పనికి రామనే భావనకు గురవుతారు. ప్రాణాలు తీసుకునేంత బలహీనులుగా మారతారు. ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యల వార్తలను ఎక్కువగా వినాల్సి వస్తోంది. పిల్లల్లో నిరాశ, నిస్పృహ ధోరణులు కనిపిస్తే- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తం కావాలి. వారికి తగిన ధైర్యాన్నివ్వాలి.

మారుతున్న కాలానికి తగ్గట్లుగా పరుగులు తీయలేక కొందరు, ఆర్థిక, వ్యక్తిగత, మానసిక.. ఇలా ఎన్నెన్నో కారణాలతో తనువు చాలిస్తున్నారు. అయితే ఏదైనా బతికి సాధించుకోవాలని గానీ, ఆత్మహత్యతో ఏ ప్రయోజనం లేకపోగా, వారి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతుంది. పరిశోధకుల అధ్యయనం ప్రకారం.. ఎవరైతే తాను ఇక బతకడం వృథా అని పదే పదే ఆత్మహత్య గురించి మాట్లాడతారో, తమకు తామే హాని చేసుకోవడానికి యత్నిస్తారో వారిలో ఆత్మహత్య ఆలోచనలు ఉంటాయి. అటువంటి వారు ఎక్కువగా ఒంటరితనాన్ని ఇష్టపడతారు. ప్రతి సందర్భంలోనూ చికాకుపడటం, ఇతరులతో మాట్లాడకుండా ఏకాకిగా ఉండడం చేస్తుంటారు. తాము చేసే ప్రతి పనిలోనూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిద్రలేమితో బాధ పడతారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఆ వ్యక్తులకు భరోసా అవసరమని మానసిక వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న దాని ప్రకారం 15 - 19 సంవత్సరాల వయస్సు గల యువతలో మరణానికి నాలుగో ప్రధాన కారణం ఆత్మహత్య అని తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 7 లక్షల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో 77 శాతం కేసులు తక్కువ, మధ్య ఆదాయ దేశాల నుంచి ఉంటున్నాయి. ఇటువంటి ఆత్మహత్యలను నియంత్రించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. విద్యార్థులకు భరోసాగా ఉండటానికి విద్యాలయాలలో మానసిక నిపుణుల నియమించాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. కొన్ని సమయాల్లో కొన్ని కోర్సులకే డిమాండ్ ఉంటుంది. విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి వాటిని నేర్చుకుంటారు. తీరా నేర్చుకున్నాక వాటితో ఉపాధి అవకాశాలు రాకుండా పోతాయి. వివిధ కోర్సులకి సమాన అవకాశాలు ఉండేవిధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. విద్యార్థులతో తల్లి తండ్రులు కొంత సమయం గడపాలి. వారి సమస్యలని వినాలి. మార్కులే ప్రామాణికంగా కాకుండా వారికి ఇతర విషయాల్లో కూడా శిక్షణ ఇవ్వాలి. తల్లిదండులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు ఉమ్మడిగా ఆత్మహత్యల నివారణకు కృషి చేయాలి.

- యం.రాం ప్రదీప్,
జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు
9492712836

శాలిబండలో భారీ అగ్ని ప్రమాదం

- డ్రైవర్ మృతి
- ముగ్గురికి తీవ్రగాయాలు

హైదరాబాద్ : పాతబస్తీ శాలిబండలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. లాల్ దర్వాజ ఎక్స్ రోడ్ వద్ద ఉన్న గోమతి ఎలక్ట్రానిక్స్ షోరూంలో సోమవారం రాత్రి భారీగా మంటలు చెలరేగాయి. పెద్ద మొత్తంలో ఆస్థి నష్టం సంభవించింది. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. ఎనిమిది ఫైర్ ఇంజిన్లతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. రెండు అంతస్తుల్లో గోమతి ఎలక్ట్రానిక్స్ షోరూం ఉంది. ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలకు మంటలు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. సమీప దుకాణాలకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

శాఖల తీరు మారదా?

- సి-గ్రేడ్‌లో 7 శాఖలు
- ఆందోళన కలిగిస్తున్న కీ ఇండికేటర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పాలనను పరుగులు పెట్టిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్నప్పటికీ.. శాఖల పనితీరు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా కనిపిస్తోంది. శాఖల పనితీరు ఆధారంగా తయారుచేస్తున్న కీ ఇండికేటర్లు పరిశీలిస్తే అనేక శాఖలు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్నది స్పష్టమవుతోంది. ప్రధానంగా సంక్షేమమే మా అజెండా అంటూ చెప్పుకుంటున్న తరుణంలో అనేక సంక్షేమ శాఖలు ఏకంగా అట్టడుగు స్థానంలో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. మొత్తం 30 శాఖల పనితీరు ఆధారంగా కీ ఇండికేటర్లను తయారుచేశారు. ఎ+, ఎ, బి, సి కేటగిరీలుగా శాఖలను విభజించారు. ఇందులో కేవలం 6 శాఖలు ఎ+ కేటగిరిలో ఉన్నాయి.

సి కేటగిరిలో 7 శాఖలు అట్టడుగు స్థానాలను ఆక్రమించాయి. చాలా బాగా పనిచేస్తున్నట్లు గుర్తించిన ఆరు శాఖల్లో గృహ నిర్మాణం, ఆహార పౌర సరఫరాలు, గిరిజన సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక, రెవెన్యూ శాఖలు ఉన్నట్లు అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. ఇందులో అప్పుల ఊబిలో కూరుకుపోతున్న ఆర్థికశాఖ, మన్యంలో డోలీల మోతను నివారిం చలేకపోతున్న గిరిజన సంక్షేమశాఖ కూడా ఉన్నాయి. ఇక ఎ కేటగిరిలో 9 శాఖలు ఉండగా, వాటిలో వైద్యారోగ్యం, మహిళా సంక్షేమం, విద్యుత్, సెకంటరీ ఎడ్యుకేషన్, కార్మిక, మున్సిపల్, పట్టణా భివృద్ధి, ప్రణాళిక, పంచాయతీరాజ్, పశు సంవర్ధక శాఖలు ఉన్నాయి. పనితీరు ఆశాజనకంగా లేని సి-కేటగిరిలో 8 శాఖలు ఉండగా, అందులో అటవీ, ఉన్నత విద్య, ఐటి, పరిశ్రమలు, రోడ్లు రవాణా, యువజన శాఖ, నీటిపారుదల, సాంఘిక సంక్షేమ శాఖలు ఉన్నాయి. అటు చంద్రబాబు, ఇటు లోకేష్ కూడా ఐటి రంగానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెబుతున్న తరుణంలో ఐటి శాఖ సి-గ్రేడ్‌లో ఉండటం అందరినీ ఆశ్చర్యం కలిగిస్తోంది.

వ్యవసాయం, పెట్టుబడులు అట్టడుగులో..

అత్యంత కీలకమైన వ్యవసాయ రంగం పనితీరు నివేదికలో విస్పష్టంగా పేర్కొన్నారు. మొత్తం 96 ఇండికేటర్లుతో పనితీరును అధ్యయనం చేయగా, కేవలం 46 పాయింట్లతో సి-కేటగిరికి పడిపోయింది. అలాగే రాష్ట్రానికి భారీ పెట్టుబడుల శాఖ కూడా సి-కేటగిరిలోనే ఉంది. ఈ శాఖలో 11 ఇండికేటర్లతో క్రోడీకరించగా, 22 పాయింట్లు మాత్రమే సాధించింది.

అడుగు నుంచి ఏడో స్థానంలో హోమ్

శాంతిభద్రతలకు కీలకమైన హోంశాఖ అట్టడుగు నుంచి ఏడో స్థానంలో నిలిచింది. ఆ శాఖ పనితీరు ఆశించిన స్థాయిలో లేదన్న విమర్శలకు ఈ ఇండికేటర్లు బలం చేకూరుస్తున్నాయి. అలాగే మైనార్టీ సంక్షేమశాఖ, బిసి సంక్షేమ శాఖ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం కూడా సి-కేటగిరిలోనే ఉండగా, గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ చివరి స్థానంలో ఉన్నట్లు తేల్చారు. ఈ శాఖకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా సమగ్రంగా అందుబాటులో లేకపోవడం గమనార్హం.

ఎందుకిలా వెనుకబాటు

కొత్త ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తుండగా, ఇప్పటివరకు అనేక శాఖల్లో ప్రగతి లేకపోవడంపై కొంతమంది అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అనునిత్యం అనేక శాఖలతో ముఖ్యమంత్రి సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ పెద్దగా ఉపయోగం లేకపోవడంపైనా చర్చ జరుగుతోంది. ప్రణాళికశాఖ సిద్ధం చేసిన ఈ ఇండికేటర్లపై కూడా చర్చ పెరుగుతుండటం గమనార్హం. త్వరలోనే దీనిపైనా ముఖ్యమంత్రి ఒక సమావేశాన్ని నిర్వహించే అవకాశాలున్నాయని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

గల్లంతయిన యువకుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి - కొమరాడ

కొమరాడ మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామ్ నదిలో స్నానానికి దిగి గల్లంతయిన ముగ్గురు యువకుల మృతదేహాల ఆచూకీ సోమవారం లభ్యమైంది. రబ్బరు డ్యాం వద్ద ఆదివారం సాయంత్రం ఒకర్ని కాపాడేందుకు మిగిలిన ఇద్దరు దిగి ప్రమాదం బారినపడి ముగ్గురు యువకులు గల్లంతైన విషయం పాఠకులకు తెలిసిందే. సోమవారం ఉదయం నుంచి రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది నదీ పరివాహక ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరంగా చేశారు. దేవునికొండ సమీపంలో నాగావళి, జంఝావతి నదుల ఒడ్డున రెండు మృతదేహాలను స్థానికులు గుర్తించారు.

భారత్-బెల్జియం హాకీ మ్యాచ్ వాయిదా

- వర్షంతో నిలిచిన మ్యాచ్
- సుల్తాన్ అజ్లాన్ షా కప్

కౌలాలంపూర్: సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నమెంట్‌లో భారత్-బెల్జియం జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా వాయిదాపడింది. ఇరుదేశాల మధ్య జరగాల్సిన ఈ మ్యాచ్ తొలి క్వార్టర్ తర్వాత భారీ వర్షం కురడంతో మ్యాచ్ అర్థాంతరంగా నిలిచింది. రాత్రి 8.45 ని.లకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్ రాత్రి 10.15 ని.ల వరకు కూడా వర్షం తగ్గలేదు. దీంతో మ్యాచ్‌ను మరుసటిరోజుకు వాయిదావేశారు. ఈ టోర్నమెంట్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో కొరియాను చిత్తుచేసి 2వ స్థానంలో నిలువగా.. తాజా మ్యాచ్ వాయిదా పడడంతో భారత్ 3వ స్థానానికి పడిపోయింది. సోమవారం జరిగిన ఇతర పోటీల్లో న్యూజిలాండ్ జట్టు 3-1గోల్స్ తేడాతో కొరియాను, ఆతిథ్య మలేషియా జట్టు 3-2గోల్స్ ఏడాతో కెనడాను ఓడించాయి. దీంతో 2 మ్యాచ్‌లు ముగిసేసరికి న్యూజిలాండ్, మలేషియా జట్లు టాప్-2లో నిలువగా.. ఇండియా, బెల్జియం ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

డేవిస్‌కప్ విజేత ఇటలీ

- ఫైనల్లో స్పెయిన్‌పై విజయం

రోమ్: డేవిస్ కప్-2025 టైటిల్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ ఇటలీ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో, మాటో బెర్రెట్టిని, కర్రెనో బూస్టా, ఫ్లావియో కోబొల్లితో కూడిన ఇటలీ జట్టు స్పెయిన్‌ను ఓడించింది. తొలి రెండు సింగిల్స్‌లో మాటో బెర్రెట్టిని, ఫ్లావియో కోబొల్లి తమ తమ మ్యాచ్‌లలో గెలిచి ఇటలీని 2-0 ఆధిక్యతలో నిలిపారు. ప్రపంచ 56వ ర్యాంకర్ అయిన బెర్రెట్టిని 6-3, 6-4తో ఫ్లాబియో కర్రెన్నో బూస్టా(స్పెయిన్)ను ఓడించాడు. మొత్తం 13 ఏస్‌లు, 21 విన్నర్ షాట్స్ కొట్టాడు. దీంతో డేవిస్ కప్ చరిత్రలో బెర్రెట్టిని 11వ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. అంతకుముందు డేవిస్‌కప్‌లో అదరగొడుతున్న ఫ్లావియో కోబొల్లి 1-6, 7-6(7-5), 7-5తో జుమీ మునార్‌ను ఓడించి ఇటలీకి 1-0 ఆధిక్యతలో నిలిచాడు. రివర్స్ సింగిల్స్‌లోనూ కోబొల్లి 7-5, 6-3తో మ్యాచ్‌ను ముగించాడు. ఇటలీ జట్టు 2023, 2024లోనూ డేవిస్ కప్ టైటిళ్లను కైవసం చేసుకొని వరుసగా మూడోసారి గెలుపుతో హ్యాట్రిక్ కొట్టింది.

మరో వైట్‌వాష్ తప్పదా..?

- టెస్టుల్లో స్వదేశంలో పట్టు కోల్పోతున్న టీమిండియా

టెస్టుల్లో టీమిండియా మరోసారి వైట్‌వాష్ అంచున నిలిచింది. సరిగ్గా ఏడాది క్రితం 2024 అక్టోబర్‌లో న్యూజిలాండ్ చేతిలో మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 0-3తో కోల్పోయి వైట్‌వాష్‌కు గురైన టీమిండియా.. తాజాగా దక్షిణాఫ్రికాతో జరిగే రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లోనూ అదే ప్రమాదపు అంచున నిలిచింది. న్యూజిలాండ్ గెలుపు గాలివాటం.. మన గడ్డపై, ముఖ్యంగా స్పిన్నర్లకు స్వర్గధామమైన టీమిండియా పిచ్‌లపై విదేశీ ప్లేయర్లు చెలరేగడమా..? అనుకునేలోపే ఈ ఏడాది కూడా భారత పిచ్‌లపై దక్షిణాఫ్రికా ఆటగాళ్లు చెలరేగారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి-2025) ఛాంపియన్ హోదాలో భారతగడ్డపై అడుగిడిన సఫారీ జట్టు అందుకు తగ్గట్టుగానే ప్రదర్శన కనబర్చగా.. ఇంగ్లండ్, వెస్టిండీస్ విదేశీ పర్యటనల్లో చూపించిన తెగువను టీమిండియా మనగడ్డపై చూపలేకపోయింది. తొలిటెస్ట్‌లో భారతజట్టు దక్షిణాఫ్రికా చేతిలో 30 పరుగుల తేడాతో ఓడింది. స్పిన్నర్లకు స్వర్గధామమైన కోల్‌కత్తాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఆ జట్టు నిర్దేశించిన 124పరుగుల లక్ష్యాన్ని టీమిండియా ఛేదించలేక... కేవలం 91 పరుగులకే కుప్పకూలింది. ఆ ఓటమినుంచి తేరుకొనే లోపే రెండో టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 487పరుగుల భారీస్కోర్ దక్షిణాఫ్రికాకు సమర్పించుకుంది. కనీసం డ్రా అయినా చేసుకుంటారేమో అనుకొనేలోపు భారతజట్టు తొలి ఇన్నింగ్స్ 201పరుగులకే పరిమితమైంది. మరో రెండ్రోజుల ఆట మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా జట్టు భారత్‌పై 314పరుగుల భారీ ఆధిక్యతను సంపాదించింది. ఈ మ్యాచ్‌ను టీమిండియా కనీసం డ్రా చేసుకున్నా.. దక్షిణాఫ్రికాకు టీమిండియా టెస్ట్ సిరీస్‌ను సమర్పించుకున్నట్లే.. అద్భుతం జరిగితే మినహా.. టీమిండియాకు మరో వైట్‌వాష్ తప్పదేమో..!

-స్పోర్ట్స్ కరస్పాండెంట్

న్యూజిలాండ్ చేతిలో (వైట్‌వాష్) ఇలా...

అక్టోబర్ 16-20, 2024 : తొలిటెస్ట్ 8వికెట్ల తేడాతో పరాజయం (చిన్నస్వామి స్టేడియం, బెంగళూరు)

అక్టోబర్ 24-28, 2024 : రెండోటెస్ట్ 113 పరుగుల తేడాతో ఓటమి (మహారాష్ట్ర క్రికెట్ స్టేడియం)

నవంబర్ 1-5, 2024 : మూడో టెస్ట్ 25పరుగుల తేడాతో ఓటమి (వాంఖడే స్టేడియం, ముంబయి)

బ్యాంక్ ఆఫ్ ఇండియా
Bank of India
Relationship beyond banking
గాంధీనగర్ బ్రాంచి, చిరునామా: 24-7-13, నంబూరివారి స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ-520003. ఫోన్: 0866-2440409

స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్-8(1) క్రింద నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు ... [illegible]

... జాగిర్ మాచవరం, డోర్ నెం. 32-26-79/1, మోడరన్ సూపర్ మార్కెట్ దగ్గర, అన్‌సర్వే బ్లాక్ నెం.18, పాత అసెస్‌మెంట్ నెం.6071 & ప్రస్తుతము అసెస్‌మెంట్ నెం. 1073098658, యన్.టి.యస్.నెం.2/2 నందు 88.03 చ॥గ॥ లేదా 73.75 చ॥మీ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ స్థలము మరియు అందులోని గ్రౌండ్ + 3 ఫ్లోర్స్ ఆర్‌సిసి రూఫ్ కమర్షియల్ కమ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** పల్లపోతు విష్ణుమూర్తికి చెందిన ఆస్తి; **దక్షిణం:** పొట్టి చిన్న వీర్రాజుకు చెందిన ఆస్తి; **పడమర:** అందలం ధనలక్ష్మికి చెందిన ఆస్తి; **ఉత్తరం:** మునిసిపల్ రోడ్డు.

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీలకు రూ.2వేల వరకు నగదు విరాళాలను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఎంత మొత్తం విరాళంగా ఇస్తున్నారన్న దానితో నిమిత్తం లేకుండా పారదర్శకత కోసం ప్రతి రాజకీయ విరాళాన్ని ఆదాయపన్ను పరిధి కిందకు తీసుకురావాలని పిటిషన్ కోరుతోంది. రూ.2వేల నగదు విరాళాలైనా సరే రాజకీయ పార్టీలు వెల్లడించాల్సిందేనని, ఎన్నికల కమిషన్ ఈ విషయంలో ఏ పార్టీని మినహాయించరాదని పిటిషన్ కోరుతోంది. తమ దాతల వివరాలను పూర్తిగా ఆ పార్టీలు వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంటోంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ నోటీసులు జారీ చేసింది. తమకు చెల్లించే మొత్తం ఎంతైనా సరే దానితో సంబంధం లేకుండా ఆ వ్యక్తి పేరు, ఇతర వివరాలను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా వెల్లడించాలి. రాజకీయ విరాళాల విషయంలో పారదర్శకత పాటించడం కోసం నగదుగా ఎంత మొత్తమైనా సరే స్వీకరించరాదని పిటిషన్ కోరింది. భారత ఎన్నికల కమిషన్‌తోపాటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డుతో సహా మొత్తంగా 13 రాజకీయ పార్టీలను ప్రతివాదులుగా పిటిషన్ చేర్చింది. ఖెమ్ సింగ్ భాటి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా వాదిస్తున్నారు. ఆదాయపన్ను చట్టం, 1961లోని సెక్షన్ 13ఎ క్లాజు (డి) చెల్లుబాటును ఈ పిటిషన్ సవాలు చేసింది. రాజకీయ పార్టీలకు ఆదాయపన్ను మినహాయింపును అనుమతించే ప్రత్యేక నిబంధన సెక్షన్ 13ఎ. రూ.2వేలు వరకు నగదు రూపంలో విరాళాలను స్వీకరించేందుకు పార్టీలను క్లాజు (డి) అనుమతిస్తోంది. అయితే జాతీయ స్థాయి రాజకీయ పార్టీలు అందుకునే మొత్తాల్లో దాదాపు 60శాతం అజ్ఞాత వనరుల నుండే వస్తున్నాయి. రాజకీయ పార్టీలు దాఖలు చేసిన ఆడిట్ నివేదికలు, విరాళాల రిపోర్టులన విశ్లేషిస్తే అవన్నీ కూడా అసంపూర్తిగానే వున్నాయని, పూర్తి వివరాలేవీ వెల్లడించటంలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ముగిసిన ఐబొమ్మ రవి కస్టడీ

- చంచల్‌గూడ జైలుకు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినిమా పైరసీ కేసులో అరెస్టయిన ఇమ్మడి రవి పోలీసు కస్టడీ సోమవారంతో ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు అతని నుంచి కీలక సమాచారం రాబట్టారు. నిందితుడిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఐబొమ్మ రవి ఒక్కడే పైరసీ చేశాడని, దాదాపు రూ.వంద కోట్లకుపైగా సంపాదించాడని పోలీసులు అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ఇందులో రూ.30 కోట్లకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలను ఇప్పటికే సేకరించారు. మూవీపై క్లిక్ చేయగానే దాదాపు 15 నుంచి 20 యాడ్స్‌కు డైరెక్ట్ లింక్ అయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేయడంతో భారీగా లాభాలొచ్చాయని తెలిసింది. రవి ఐదు రోజుల కస్టడీలో వెబ్‌సైట్, డొమైన్ నెట్‌వర్క్స్, ఐపీమాస్క్ తదితర అంశాలపై పోలీసులు ఆరా తీసినట్టు సమాచారం. రవి, అతని స్నేహితుడు ఇద్దరూ కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్ తదితర అంశాల్లో పాల్గొన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ యాప్‌తోపాటు ఇతర యాప్‌ల ద్వారా భారీగా డబ్బులు సంపాదించిన రవి వివిధ బ్యాంకుల్లో రూ.20 కోట్ల బదిలీ చేయించుకున్నాడు. లావాదేవీలపై బ్యాంక్ అధికారుల సహకారంతో వివరాలు తెప్పించుకున్న పోలీసులు ఆ దిశగా రవిని ప్రశ్నించినట్టు తెలిసింది. వచ్చిన డాలర్లను క్రిప్టో కరెన్సీ ద్వారా నిఖిల్ అనే తన స్నేహితుడికి పంపినట్టు గుర్తించారు. ఇదిలావుండగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు అన్నీ తానొక్కడినే చేశానని, తన వెనుక ఎవరూ లేరని రవి సమాధానం చెప్పినట్టు తెలుస్తోంది. మరోసారి రవిని కస్టడీకి తీసుకుని మరిన్ని పూర్తి వివరాలు రాబట్టేందుకు కోర్టులో పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు.

ఐఎన్ఎస్ మాహేను ప్రారంభించిన భారత నేవీ..

ముంబయి : దేశీయంగా రూపొందించిన నౌక ఐఎన్ఎస్ మాహేను భారత నౌకదళం సోమవారం ప్రారంభించింది. ముంబయిలోని నావల్ డాక్‌యార్డ్‌లో ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ ముఖ్య అతిథిగా ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మాహే భారత జలాల్లోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో నౌకాదళానికి చెందిన సీనియర్ అధికారులు, కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ - షాలో వాటర్ క్రాఫ్ట్ (ఎఎస్‌డబ్ల్యూ-ఎస్‌డబ్ల్యూసి)లో మొదటిదైన ఈ ఐఎన్ఎస్ మాహేను కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సిఎస్ఎల్) నిర్మించింది. ఈ నౌకా నిర్మాణంలో 80 శాతానికి పైగా స్వదేశీ కంటెంట్‌ను వినియోగించారు. మలబార్ తీరంలోని చారిత్రక పట్టణం మాహేను ఈ నౌకకు పెట్టారు. అలాగే, దీనిపై 'ఉరుమి'ని ఏర్పాటు చేశారు. ఇది కలరిపయట్టులో ఉపయోగించే ఒక రకమైన ఆయుధం. ఈ నౌక వెస్ట్రన్ సీ బోర్డు అధీనంలో కార్యకలాపాలు నిర్వహించనుంది. శత్రు జలాంతర్గాములను వేటాడేందుకు, తీర ప్రాంతంలో గస్తీని నిర్వహించేందుకు దీన్ని మొహరించనున్నారు. అధునాతన సామర్థ్యాలు ఉన్న ఈ నౌక నీటిలో చాలా నిశ్శబ్దంగా కదులుతుంది. కాబట్టి శత్రు జలాంతర్గాములు దీని రాకను గుర్తించలేవు. కావున దీన్ని 'సైలెంట్ హంటర్'గా పిలుస్తున్నారు.

పట్టణం నుంచి సిజెఐ వరకూ జస్టిస్ సూర్యకాంత్ ప్రస్థానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సిజెఐ) ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్ చిన్న పట్టణం నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న ఒక మధ్యతరగతి కుటుంబంలో ఆయన జన్మించారు. 1981లో హిస్సార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల నుంచి పట్టభద్రులయ్యారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీని పొందారు. 1984లో హిసార్‌లోని జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1985లో చండీగఢ్‌కు మారి, పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. రాజ్యాంగ, సర్వీస్, పౌర విషయాల్లో ప్రత్యేకత కలిగి ఉన్నారు. 2000 జులై 7న హర్యానాకు అతి పిన్న వయస్కుడైన అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. 2001 మార్చిలో సీనియర్ అడ్వకేట్‌గా నియమితులయ్యారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2007, 2011లో వరుసగా రెండుసార్లు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పాలకమండలి సభ్యుడిగా నామినేట్ అయ్యారు. సుప్రీంకోర్టు ఆధ్వర్యాన డీమ్డ్ విశ్వవిద్యాలయం అయిన ఇండియన్ లా ఇన్‌స్టిట్యూట్‌లో వివిధ కమిటీల్లో సభ్యుడిగా ఉన్నారు. 2011లో కురుక్షేత్ర విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నుంచి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీలో ఫస్ట్ క్లాస్ ఫస్ట్‌గా నిలిచి మరో ఘనతను సాధించారు. 2018 అక్టోబరు 5న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా 2024 నవంబరు 12న నియమితులయ్యారు.

పలు తీర్పుల్లో భాగస్వామిగా...

370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌరసత్వ హక్కులు, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి అంశాల్లో తీర్పులిచ్చిన ధర్మాసనాల్లో ఆయన భాగస్వామిగా ఉన్నారు. బీహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా అన్ని బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు ఇచ్చారు. చట్ట విరుద్ధంగా పదవి నుంచి తొలగించిన మహిళా సర్పంచ్‌ను తిరిగి నియమించిన ధర్మాసనానికి ఆయన నాయకత్వం వహించారు. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను పరిష్కరించడంలో గవర్నరు, రాష్ట్రపతి అధికారాలపై విచారించే ధర్మాసనంలో ఆయన ఉన్నారు. దేశద్రోహ చట్టాన్ని నిలిపేసిన ధర్మాసనంలో ఆయన భాగంగా ఉన్నారు. ప్రభుత్వ సమీక్ష జరిగే వరకు దాని కింద కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకూడదని ఆదేశించారు. రక్షణ బలగాలకు ఒఆర్ఒపి (వన్ ర్యాంక్-వన్ పెన్షన్ పథకం) రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. పెగాసెస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశాల్లో పాల్గొన్న కల్నల్ సోఫియా ఖురేషిని లక్ష్యంగా చేసుకుని మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన జస్టిస్ సూర్యకాంత్, మంత్రి పలికే ప్రతిమాట బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసే ధర్మాసనానికి ఆయన నాయకత్వం వహించారు. సిబిఐ పంజరంలో ఉన్న చిలుక అనే భావనను తొలగించడానికి కృషి చేయాలని సూచించారు. గృహ కార్మికులకు చట్టపరమైన భద్రత లేకపోవడాన్ని ఆయన ధర్మాసనం గుర్తించి, ఈ శ్రామిక శక్తికి రక్షణ కల్పించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. 1967 ఎఎంయు తీర్పును కొట్టివేసిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఉన్నారు.

పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించిన మలేషియా

- వచ్చే ఏడాది జనవరి నుండి అమల్లోకి
- ఖాతాలు వినియోగానికి ఇకెవైసి తప్పనిసరి

క్వాలాలంపూర్ : మలేషియాలో పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని 16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియాను నిషేధిస్తున్నామని ప్రభుత్వ కమ్యూనికేషన్స్ మంత్రి ఫహ్మి ఫదిల్ ఆదివారం ప్రకటించారు. దీంతో పిల్లలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల యాక్సెస్‌ను పరిమితం చేస్తున్న దేశాల జాబితాలో మలేషియా కూడా చేరింది. ఈ నిషేధాన్ని తన కొత్త ఆన్‌లైన్ సేఫ్టీ యాక్ట్ 2025లో మలేషియా చేర్చనుంది. ఇది 2026 జనవరి 1 నుండి అమల్లోకి రానుంది. సోషల్ మీడియా ఉపయోగించే వారి కనీస వయస్సును 13 నుండి 16కి పెంచుతున్నారు..అలాగే ఖాతా నమోదు సమయంలో ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఇకేవైసి) వయస్సు ధృవీకరణను అమలు చేస్తామని మంత్రి ఫహ్మి తెలిపారు. వినియోగదారులు మైకార్డ్, పాస్‌పోర్ట్ లేదా మైడిజిటల్ ఐడి వంటి అధికారిక గుర్తింపు పత్రాలను ఉపయోగించి తమ వయస్సును ధృవీకరించాల్సి ఉంటుదని . ఈ నిర్ణయంతో ఆర్థిక మోసాలు, లైంగిక వేధింపులు తగ్గుతాయన్నారు. ఇదేవిదంగా ఆస్ట్రేలియా డిసెంబర్ 10 నుండి 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధాన్ని అమలు చేస్తోంది. ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, డెన్మార్క్, గ్రీస్ కూడా వయస్సు ధృవీకరణను పరీక్షిస్తున్నాయి.. ఫేస్ బుక్, ఇన్‌స్టా, ఎక్స్, యుట్యూబ్, స్నాప్ చాట్, థ్రెడ్స్, టిక్ టాక్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు ఈ నిబంధనల పరిధిలోకి ఉన్నాయి. అయితే ఇది అమలు చేయడం అంత సులభం కాదని, గందరగోళం లేకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని నిపుణులు తెలుపుతున్నారు.

హసీనాను అప్పగించండి

- భారత్‌కు బంగ్లాదేశ్ లేఖ

ఢాకా : తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్‌ను తమకు అప్పగించాలని కోరుతు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు లేఖ పంపింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వ విదేశాంగ శాఖ సలహాదారు తౌహిద్ హుస్సేన్ వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపధ్యంలో హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న సంగతి తెలిసిందే. హసీనా పదవీకాలంలో అనేక మంది రాజకీయ కార్యకర్తలు, విమర్శకులు అదృశ్యమయ్యారనే కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు అమలులో భాగంగా భారత్‌కు బంగ్లాదేశ్ ఈ లేఖ పంపినట్లు హుస్సేన్ తెలిపారు. తీర్పు వివరాలు ఉన్న లేఖను కూడా భారత్‌కు పంపినట్లు ఆయన వెల్లడించారు. అసదుజ్జమాన్‌ను కూడా మరణ శిక్ష విధించినయ విషయాన్ని కూడా భారత్‌కు తెలిపామన్నారు.. 'ఈ ఇద్దర్నీ ఆలస్యం చేయకుండా బంగ్లాదేశ్ అధికారులకు అప్పగించాలని మేము భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింతల ఒప్పందం ప్రకారం ఇది భారతదేశంపై కూడా ఒక బాధ్యత' అని లేఖలో బంగ్లాదేశ్ పేర్కొంది. అయితే ఈ లేఖపై న్యూఢిల్లీలోని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించాల్సి ఉంది. కాగా ఐటిసి తీర్పును 'గమనించాము' అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గతంలో వ్యాఖ్యానించింది.

పౌరసత్వ చట్టాన్ని సవరించనున్న కెనడా

- భారత సంతతి కుటుంబాలకు ప్రయోజనం!

ఒట్టావా: కెనడా ప్రభుత్వం పౌరసత్వం చట్టాన్ని సవరించనుంది. ఇందులో భాగంగా పౌరసత్వ నిబంధనల్లో భారీ మార్పులను తీసుకునిరానుంది. దీంతో కెనడాలోని వేలాది మంది భారతీయ సంతతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ తయారుచేసిన బిల్లు సి-3కి ఇప్పటికే ఆమోదముద్ర లభించినట్లు కెనడా ప్రభుత్వం మీడియాకు ఒక ప్రకటనలో తెలిపింది. ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా పేర్కొంది. 'కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఈ చట్టం అమల్లోకి రాకముందు జన్మించిన వ్యక్తులకు కూడా కెనడా పౌరసత్వం లభించనుంది' అని తెలిపింది. ఇప్పటి వరకూ కెనడా పౌరసత్వం రావాలంటే విదేశాల్లో జన్మించిన పిల్లల తల్లిదండ్రుల్లో కనీసం ఒకరైనా కెనడాలో పుట్టడమో లేదా మృతి చెందడమో జరిగిన వారికే పౌరసత్వాన్ని అందించాలనే నిబంధనను 2009లో కెనడా తీసుకువచ్చింది. దీని కారణంగా చాలామంది పౌరసత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఎదురైంది. కానీ, ఆంటారియో న్యాయస్థానం ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దీనిని ప్రభుత్వం కూడా అంగీకరించి.. అప్పీల్‌కు వెళ్లలేదు. తాజాగా తీసుకురానున్న బిల్లు ద్వారా పాత నిబంధన ప్రకారం పౌరసత్వం కోల్పోయిన వారందరికీ ఇప్పుడు సిటిజన్‌షిప్ వచ్చే అవకాశాలున్నాయి. అయితే కెనడా బయట జన్మించిన తల్లిదండ్రులు తమ పిల్లలను కనడానికి లేదా దత్తత తీసుకోవడానికి ముందు కనీసం 1,095 రోజులు దేశంలోనే ఉన్నట్లు నిరూపించుకోవాలి. బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పౌరసత్వ ప్రక్రియలో ఇటువంటి విధానాలను పాటిస్తున్నారు. క్యాబినెట్ ఉత్తర్వు తేదీని నిర్ణయించిన తర్వాత ఈ చట్టం అమల్లోకి వస్తుంది. న్యాయస్థానం కూడా దీని అమలు తుదిగడువును 2026 జనవరి వరకు పొడిగించింది. ఇది అమల్లోకి రాగానే పౌరసత్వ దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, భారత్ నుండి కెనడాకు వెళ్లేవారి సంఖ్య పెరుగుతుందని ఈ రంగానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు?

- వేడెక్కిన కర్ణాటక రాజకీయాలు

బెంగళూరు : కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై మరింతగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరితంగా బలం చేకూరుస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తేనే ఐదేళ్లు తాను ముఖ్యమంత్రిగా కొనసాగుతానని అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి మార్పుపై తుది నిర్ణయం పార్టీ కేంద్ర నాయకత్వంపై ఆధారపడి ఉందని, అధిష్టానం నిర్ణయాన్ని తాను, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ అంగీకరించాల్సి ఉంటుందని చెప్పారు. సిద్ధరామయ్య గతంలో చేసిన వ్యాఖ్యలకు, ప్రస్తుత వ్యాఖ్యలకు చాలా వ్యత్యాసం ఉంటడం గమనార్హం. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని గతంలో చెప్పిన సిద్ధరామయ్య.. ఇప్పుడు అందుకు భిన్నమైన స్వరం వినిపిస్తున్నారు. 2023లో జరిగిన కర్ణాటక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడే రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని ప్రచారం జరిగింది. దాని ప్రకారం ఈ నెలతో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్ణాటక రాజకీయాలు వేడెక్కాయి. అందుకు తగ్గట్టే సిద్ధూ, మరోవైపు డికెల శిబిరాలకు చెందిన నాయకులంతా రాకపోకలు సాగించడంతో ఆ ప్రచారం తీవ్రమైంది.

లేబర్ కోడ్‌ల పేరుతో శ్రామికవర్గంపై దాడి

(మొదటిపేజి తరువాయి)

విమర్శించారు. కేరళ వంటి రాష్ట్రాల్లోనూ ఇటువంటి అప్రజాస్వామిక చట్టాలు అమలు చేయాలని ఒత్తిడి చేస్తోందని, వీటిని అంగీకరించే ప్రసక్తే లేదని తెలిపారు. కార్మికవర్గంపై దాడి చేయడం అంటే మొత్తం ప్రజలపైదాడి చేయడమేనని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈనెల 26న కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనను సిపిఎం పూర్తిగా సమర్థిస్తుందని తెలిపారు.

గూగుల్ డేటా సెంటర్ వివరాలు బయటపెట్టాలి

విశాఖపట్నం దగ్గర్లోని తర్లువాడలో పెడుతున్న అదానీ గూగుల్ డేటా సెంటర్ వివరాలను వెంటనే బయటపెట్టాలని రాఘవులు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఉపయోగమే అయితే వివరాలు ఎందుకు బయపెట్టడం లేదని ప్రశ్నించారు. అక్కడ 49 మంది దళిత రైతుల నుండి 100 ఎకరాలు డిఫారం పట్టా భూములు బలవంతంగా తీసుకుంటున్నారని అన్నారు. రూ.1.50 లక్షల కోట్లతో కంపెనీ పెడుతున్న గూగుల్ అక్కడ రైతుల నుండి తీసుకుంటున్న భూములకు భూమిని ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు. దానికి ఎంత నీరు, విద్యుత్ కావాలనే విషయాలనూ బయటపెట్టాలన్నారు. నీటిని ఎక్కడ నుండి తీసుకొస్తారో చెప్పాలన్నారు. డేటా సెంటర్‌కు వాడే విద్యుత్‌తో విశాఖపట్నానికి ఏడాది మొత్తం ఉచితంగా సరఫరా చేయొచ్చని పేర్కొన్నారు. డేటా సెంటర్ల వల్ల వాతావరణం దెబ్బతింటుందని, ప్రపంచంలో చాలాదేశాలు వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. అటువంటి డేటా సెంటర్‌ను తీసుకొచ్చి ఇక్కడ పెట్టడం ఎందుకో చెప్పాలన్నారు. దీనిపై కనీసం సామాజిక పర్యావరణ అధ్యయన నివేదిక కూడా బయటపెట్టలేదని, అసలు పర్యావరణ ప్రభావం అంచనా చేశారా లేదా చెప్పాలన్నారు. లక్షల ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నప్పుడు అక్కడ స్థానికులకు ఎందుకు ఉపాధి కల్పించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రజలను, హక్కులను, వాతావరణాన్ని ఫణంగా పెట్టే గూగుల్‌ను ఇక్కడకు ఎందుకు తీసుకువస్తున్నారో చెప్పాలన్నారు.

సంజీవని పేరుతో వైద్యసేవలు ప్రైవేటుపరం

ముఖ్యమంత్రి ప్రకటించిన సంజీవని అమలు చేయడమంటే ఆరోగ్య సేవలను ప్రైవేటుపరం చేయడమేనని రాఘవులు విమర్శించారు. దీనికి సంబంధించిన విషయాలను కూడా ప్రభుత్వం దాచేస్తోందని తెలిపారు. గత బడ్జెట్లో రూ.19,000 కోట్లు కేటాయించారని అదంతా ఖర్చు చేస్తే ఆరోగ్యరంగం పెద్దఎత్తున అభివృద్ధి చెందేదని అన్నారు. ఆరోగ్యరంగాన్ని పూర్తిగా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం కోసమే దీన్ని పెట్టారని, దీనివల్ల కార్పొరేట్లకు లబ్ధి తప్ప పేదలకు ఏమీ ఉండదని పేర్కొన్నారు. దీనిలో టిసిఎస్, బిల్‌గేట్స్ మిలిందా ఫౌండేషన్ భాగస్వాములని తెలిపారు. దీనివల్ల ప్రజల ఆరోగ్య డేటా మొత్తం ప్రైవేటు మందుల కంపెనీలకు, పరిశోధనా సంస్థలకు ఇన్సూరెన్స్ కంపెనీలకు లబ్ధి కలిగిస్తుందని, వేల కోట్ల వ్యాపారానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్పొరేట్ల లాభాల కోసం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.

అపరేషన్ కగార్ పేరుతో గిరిజనులపై దాడి

ఎన్‌కౌంటర్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులను కాల్చిచంపుతోందని, ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజన ప్రజానీకంపై యుద్ధం చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు అడవి, సహజ వనరులు, ఖనిజాలపై కన్నేశాయని, వాటికోసం మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల పేరుతో గిరిజనులను తరిమేసి, అడవులను కార్పొరేట్లకు అప్పగించడం కోసం కేంద్రం చేస్తున్న కుట్రల్లో భాగమే మావోయిస్టుల హత్యలని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ బూటకమని, వేర్వేరు చోట్ల తలదాచుకున్న వారందరినీ పట్టుకెళ్లి కాల్చిచంపుతున్నారని అన్నారు. గతంలో మావోయిస్టులు సిపిఎం నాయకులను కాల్చిచంపారని, అయినా రాజకీయంగా విభేదిస్తూనే వారిపై జరిగే దాడిని వ్యతిరేకిస్తామని తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. చర్చలకు సిద్ధమన్న వారిని పట్టుకు చంపుతున్నారని పేర్కొన్నారు. అలాగే ఎన్‌కౌంటర్లకు రాష్ట్రాన్ని అనువైన ప్రాంతంగా గుర్తించారని, రాష్ట్ర ప్రభుత్వం బిజెపి క్రూరత్వానికి ప్రతినిధిగా నిలుస్తోందని అన్నారు. దేశాల మధ్య యుద్ధరంగంలో సైనికులు దొరికితే వారిని మర్యాదగా చూసుకుని ఆయా దేశాలకు తిరిగి అప్పగిస్తారని, కానీ పోలీసులు మాత్రం మావోయిస్టులను పట్టుకుని కాల్చిచంపుతూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కస్టడీలో ఉన్న మావోయిస్టులను కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండు చేశారు.

రైతులకు చేసిందేమిటి : వి.శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రైతున్న మీకోసం పేరుతో కార్యక్రమం చేపట్టిందని, అసలు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు, వ్యవసాయానికి చేసిన మేలేమిటో చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. 30 లక్షల మంది కౌలుదారులకు అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్రంలో పండుతున్న ఏ పంటకూ గిట్టుబాటు ధరలేదని, ఎందుకు కల్పించలేకపోతోందో చెప్పాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు లక్షకోట్ల ఆదాయాన్ని కోల్పోయారని తెలిపారు. అలాగే పత్తి, మొక్కజొన్న, సోయా, పాల ఉత్పత్తులను అమెరికా నుండి దిగుమతి చేసుకునేందుకు ట్రంప్‌తో మోడీ ఒప్పందం చేసుకున్నారని అన్నారు. ఈ ఒప్పందంతో వ్యవసాయానికి మరణశాసనం రాయడమేనని అన్నారు. దీనివల్ల రైతులు నష్టపోతారని, వారిపై ప్రభుత్వానికి కనీస సానుభూతి కూడా లేదని పేర్కొన్నారు. ఇదంతా రైతులను దివాళా తీయించే కార్యక్రమనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పోలవరం బనకచర్ల పేరుతో రాష్ట్రంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, రూ.2000 కోట్ల ఖర్చు చేస్తే వెనుకబడిన జిల్లాలో అనేక ప్రాజెక్టులు పూర్తవుతాయని, అయినా చేయడం లేదని అన్నారు. ఇటీవల పోలవరం పునరావాసం కోసం రూ.1000 కోట్లు కేటాయిస్తే దానిలో 12 శాతం కూడా నేరుగా నిర్వాసితులకు చేరలేదని, ఎక్కువ మొత్తం కాంట్రాక్టర్లకు ఇచ్చేశారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని అన్నారు.

ఇండియా గేట్ వద్ద నిరసనలో పాల్గొన్న 22 మంది అరెస్టు

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రంగా నెలకొందని, ప్రభుత్వం ఎలాంటి నియంత్రణా చర్యలు తీసుకోవడం లేదని నిరసిస్తూ ఇండియా గేట్‌కు సమీపంలో ఆదివారం నిరసనలు, ఆందోళనలు జరిగాయి. దీనిలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణ జరిగింది. అనేకమంది విద్యార్థులు గాయపడ్డారు. దీనిపై ఢిల్లీ పోలీసులు 22మందిని అరెస్టు చేశారు. వేర్వేరుగా రెండు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశారు. అనుమతి లేకుండానే ఇండియా గేట్ వద్ద నిరసనల నుండి వారిని పంపేయడానికి ప్రయత్నించినపుడు ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆందోళనకారులను అక్కడ నుండి తొలగించడానికి తాము ప్రయత్నించగా, తమపై పెప్పర్ స్ప్రే ఉపయోగించారని పోలీసు అధికారులు తెలిపారు. ఇండియా గేట్ సి హెక్సాగన్ వద్ద వారిని అడ్డగించగా వారందరూ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళారని అక్కడ వున్న అధికారులతో మరో ఘర్షణ జరిగిందని వారు చెప్పారు. అయితే నిరసనకారులు పోలీసులు కట్టుకథలు చెప్తున్నారని, ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కమాండర్ మాద్వి హిద్మా పోస్టర్లను ప్రదర్శించినందుకే తమను టార్గెట్ చేశారని వారు స్పష్టం చేశారు. బిర్సా ముండా నుండి నేటి హిడ్మా వరకూ అడవుల కోసం పోరాడిన వారేనని అందుకే వాయు కాలుష్యం సందర్భంగా ఫొటోను ఉపయోగించారని పలువురు తెలుపుతున్నారు.

రజని - వాణి

రజని ఏడవ తరగతి చదువుతోంది. ఆ అమ్మాయికి బొమ్మలు గీయడం అంటే చాలా ఇష్టం. ఎప్పుడైనా పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు పెడితే రజని పాల్గొని మొదటి బహుమతి గెలుచుకునేది.

ఒకరోజు ఆ పాఠశాలకు వాణి అనే అమ్మాయి వచ్చి చేరింది. రజని పక్కనే కూర్చొనేది. తనకి కూడా బొమ్మలు అంటే ఇష్టం. కానీ వాణికి బొమ్మలు వేయడం సరిగ్గా రాదు. వాణి వచ్చిన కొన్ని రోజులకు పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా చిత్ర లేఖనం పోటీలు పెట్టారు. అందులో రజని పాల్గొన్నది. ఎప్పటిలాగే తనకి మొదటి బహుమతి వచ్చింది. ఇది చూసి వాణి, 'తనకి కూడా బొమ్మలు గీయడం నేర్పమ'ని రజనిని అడిగింది. కానీ రజని ఒప్పుకోలేదు. బొమ్మలు నేర్పించాక, 'వాణి తనకన్నా బాగా బొమ్మలు గీస్తే అందరూ తననే మెచ్చుకుంటార'ని రజని ఈర్ష్య పడింది.

రజని బొమ్మలు నేర్పించేందుకు ఒప్పుకోక పోయినా తను వేసే బొమ్మలు చూస్తూ వాణి ఇంటి దగ్గర బొమ్మలు ప్రాక్టీస్ చేసింది. కొన్ని రోజులకి పాఠశాలలో మళ్లీ చిత్రలేఖనం పోటీ పెట్టారు. ఈసారి వాణి కూడా పాల్గొంది. పోటీలో వాణికి మొదటి బహుమతి వచ్చింది. రజనికి ద్వితీయ బహుమతి వచ్చింది.

బహుమతి తీసుకుంటూ వాణి 'తనకి ప్రథమ బహుమతి రావడానికి కారణం రజనినే' అని చెప్పింది. రజని పక్కనే కూర్చొని 'తను చిత్రాలను గీసే పద్ధతులను గమనిస్తూ నేర్చుకున్నా'నని చెప్పింది. అప్పుడు అందరూ వాణితో పాటు రజనీని కూడా ప్రశంసించారు. 'తనకు చిత్రాలు గీయడం నేర్పమని వాణి అడిగినప్పుడు తాను నేర్పన'ని తిరస్కరించడం గుర్తుకొచ్చి రజనీ ఎంతో సిగ్గు పడింది. వాణిని క్షమాపణ కోరింది. రజనిలో వచ్చిన మార్పు చూసి వాణి ఎంతో సంతోషించింది.

- యం.రెడ్డమ్మ,
9వ తరగతి,
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
పెద్ద చెప్పలి, కడప జిల్లా.

లెక్క తేల్చండి



చిన్నారులూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

99 : జవాబు

నేను గీసిన బొమ్మ

నూనె దివ్య, 7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

మట్టి గోడలు.. ఎండకి వానకి చోటిచ్చే పూరి గుడిసెలు, 'కడుపునిండా తిని ఎన్ని రోజులైందో' అని లెక్కలేసుకునే నిరుపేద జీవితాలు వారివి. బిడ్డకి కాసిన్ని అక్షరం ముక్కలు నేర్పించుకోవాలని బడి బడికి కాళ్లు అరిగేలా తిరిగిన తల్లిదండ్రులు.. 'లోకం ఎరగని' ఆడబిడ్డ అంత దూరం వెళితే ఎలాగో ఏంటో" అని బెంబేలు పడిన కుటుంబాలు వాళ్లవి. కానీ ఇప్పుడు ఆ 'లోకం చూడని' ఆడబిడ్డలు ఆ కుటుంబాలని, వాళ్లు కలలో కూడా ఊహించని విజయంతో ఉబ్బితబ్బిబ్బు చేస్తున్నారు. తాజాగా 'బ్లైండ్ మహిళా వరల్డ్‌కప్ టి-20'లో క్రికెటర్లు సాధించిన ఈ ఘనతకి లోకమంతా జేజేధ్వానాలు పలుకుతోంది. వారు సాధించిన ఈ విజయం చరిత్రలో లిఖించదగ్గది. ప్రత్యర్థి వేసిన బంతిని చూసే వీలు లేక, కేవలం శబ్దాన్ని బట్టి ఆట ఆడే వారి సంకల్పానికి ఈ విజయం కొలబద్ద కాదు.. వారి వైకల్యాన్ని, పేదరికాన్ని, వాళ్లు పడ్డ అవమానాలని, అవహేళనలని, వివక్షకి ప్రపంచమంతా వినిపించేంత గట్టిగా చెప్పిన సమాధానం.

గెలిచి చూపించారు

ఆదివారం కొలంబోలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌పై విజయం సాధించిన భారత మహిళల బృందం ఆనందంలో తేలియాడుతున్న వేళ.. కెప్టెన్ దీపికా గౌంకర్ మోకాళ్లపై నేల మీద కూర్చొని పిడికిలి బిగించి ధారాపాతంగా కన్నీళ్లు కార్చింది. ఆ కన్నీళ్ల వెనుక ఆమె ఒక్కత్తే కాదు, ఆ బృందమంతా పడిన వేదన, పేదరికంతో చేసిన పోరాటం.. ఇంకా ఎన్నో దాగున్నాయి. అందుకే ఆ క్షణం ఆనందాన్ని పంచుకోవడం కంటే ఆ బాధే తన కళ్లల్లో కనిపించింది. ఆ కళ్లకి చూపు లేదు.. అయినా లోకం ఆ కళ్లల్లోని బాధని చూసింది. బహుశా ఆ దృశ్యం చూస్తున్న వారందరికీ ఆ క్షణంలో కళ్లు వర్షించే వుంటాయి.

మారుమూల పల్లెలు, వ్యవసాయ కుటుంబాలు, రోజు కూలీ చేసుకునే కుటుంబాలు, పోషించే స్థోమత లేక, బడిలో చదువుకునే వీలు లేక వసతి గృహాల్లో తలదాచుకుంటున్న ఈ క్రీడాకారిణులు చాలా తక్కువ కాలం నుండే క్రికెట్‌ని నేర్చుకుంటున్నారు. అందరిలా చదువుకునే అవకాశమే లేని వీరు క్రికెట్‌పై పెంచుకున్న ప్రేమ ఈ రోజు వారిని ఇంత ఉన్నత స్థితిలో నుంచోబెట్టింది.

నిరుపేద కుటుంబాల నుంచి...

కొన్ని విజయాలు అంతే.. ఏ సవాలు వాటి ముందు నిలబడదు. ప్రతిభని పరిమితం చేయాలని చూసిన ప్రతిసారీ ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. కర్నాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఢిల్లీ, అస్సాం, బీహార్ నుండి వచ్చిన ఈ క్రీడాకారిణుల్లో ఎక్కువమందిని స్కూలు టీచర్లు, వైకల్య బాధితులకి ఆశ్రయం ఇచ్చే సంస్థలు, కమ్యూనిటీలు క్రికెట్‌కి పరిచయం చేశారు.

ఒక్కొక్కరిది ఒక్కో కథ..

నవజాత శిశువుగా ఉన్నప్పుడు అనుకోని ప్రమాదంలో కంటికి గాయమై చూపు కోల్పోయింది కెప్టెన్ దీపిక. ఆంధ్ర, కర్నటక సరిహద్దు గ్రామం తంబలహట్టి ఆమెది. తల్లిదండ్రులిద్దరూ వ్యవసాయ

కూలీలు. వైస్ కెప్టెన్ గంగా కదం (26) స్వస్థలం మహారాష్ట్ర. 9 మంది సంతానంలో పుట్టిన గంగ తండ్రి వ్యవసాయ కూలీ. టాప్ ఆర్డర్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన అనేకా దేవి (20) జమ్మూ కాశ్మీర్ నుండి వచ్చింది. పుట్టుకతోనే వైకల్యం ఉంది. అదే లోపం ఉన్న మేనమామ ప్రోత్సాహంతో స్కూలు విద్య పూర్తిచేసుకుని క్రికెట్ ఆటలో శిక్షణ తీసుకుంది. రెండేళ్లకే జాతీయ జట్టులో రాణించింది. ఒరిస్సాలోని గిరిజన సమూహం నుండి వచ్చిన పూలా సరేన్ (18)కి ఐదేళ్లు ఉన్నప్పుడు ఎడమ కంటికి దృష్టి లోపం వచ్చింది. తల్లి కూడా అంధురాలే. ఈ పరిస్థితుల్లో సరేన్ బాల్యం చాలా దుర్భరంగా గడిచింది. 'అంధుల పాఠశాల' టీచర్ ప్రోత్సాహంతో క్రికెట్‌లో మెలకువలు నేర్చుకుంది.

మధ్యప్రదేశ్ నుండి వచ్చిన సునీత శరత్, క్రికెట్‌లో రాణించాలని ఎప్పుడూ అనుకోలేదు. కాలేజీ విద్య పూర్తి చేసి రకరకాల ఉద్యోగాలు చేసింది. స్నేహితుల ప్రోత్సాహంతో క్రికెట్ వైపు అడుగులు వేసింది. లేటుగా వచ్చినందుకు కఠోర శిక్షణ తీసుకుంది. ఇప్పుడు అత్యంత నైపుణ్యం గల బౌలర్లలో ఒకరిగా రాణిస్తోంది. అస్సాంలోని ఓ మారుమూల పల్లె నుండి వచ్చిన సిముదాస్ కప్ గెలిచిన తరువాత అన్న ఈ మాటలు అక్షరసత్యాలు. 'మా విజయం మాలాంటి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నందుకు చాలా గర్వంగా ఉంది'.

- జ్యోతిర్మయి

లండన్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న ప్రపంచ అంధుల క్రికెట్ కౌన్సిల్ **(WBCC)** 1996 నుండి ఈ క్రీడను నిర్వహిస్తోంది. అయితే ఇప్పటివరకు పురుషులని మాత్రమే ఇందులో భాగస్వామ్యం చేశారు. 1998లో మొదటి 50 ఓవర్ల ప్రపంచ కప్‌ని 2012లో **T-20**ని ప్రారంభించారు. ప్రపంచ కప్‌లో– ఈ ఏడాదే మహిళలకి చోటు కల్పించారు. ఇందులో పాల్గొన్న మన మహిళల క్రికెట్ ప్రస్థానం చాలా చిన్నది. జాతీయంగా అంధుల క్రికెట్‌ను నిర్వహించే క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా **(CABI)** 2011 నుండి ఉంది. అయితే మహిళల జట్టు కోసం ప్రయత్నాలు 2019 నుండే ప్రారంభించారు. అలా 2023లో మొదటి అంతర్జాతీయ మ్యాచ్, అదే సంవత్సరం బర్మింగ్‌హామ్‌లో జరిగిన **IBSA** ప్రపంచ క్రీడలలో మహిళలు పాల్గొని బంగారు పతకం సాధించారు.

మన పంగి కరుణకుమారి..

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం, వంట్లమామిడి గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబానికి చెందిన కరుణకుమారి ప్రస్తుతం విశాఖపట్నంలోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ప్రాథమిక విద్య అంతా గ్రామంలోనే సాగింది. 'చదువుతో పాటు క్రికెట్ అంటే కూడా తనకి ఎంతో ఇష్టమ'ని ఒకసారి కరుణ చెప్పింది. విశాఖ వచ్చాక తన ఆటకి రవి మాస్టారు, సత్య టీచర్ ఎంతో ప్రోత్సహించారని మాట్లాడింది. బాల్యం నుండి దృష్టిలోపం ఉన్న కరుణ, 7వ తరగతి వరకు సాధారణ స్కూల్లోనే విద్యాభ్యాసం కొనసాగించింది. కళ్లు విపరీతంగా మంటలు పుట్టి, ఇక చదవలేనని స్కూలు మానేసింది. ఆ ఇంట్లో నలుగురు పిల్లలు. ముగ్గురు ఆడపిల్లల్లో కరుణ ఒకటి. మట్టి గోడలు, రాళ్ల బండల అరుగులు, తాటాకు ఇంటికప్పు ఆమె నివాసం. ఈ పరిస్థితుల్లో బిడ్డ భవిష్యత్తు బాగు పడాలని తల్లిదండ్రులు మళ్లీ స్కూల్లో చేర్పించాలనుకున్నారు. అయితే వైకల్యం కారణంగా తనని చేర్చుకోవడానికి ఎవరూ ముందుకురాలేదు. 'విశాఖలో చేర్పించుకుంటారు. అక్కడ ప్రయత్నించండి' అని గ్రామస్తులు చెప్పారు. కానీ.. అక్కడికి వెళ్లి రావడం ఆర్థికంగా వాళ్లకి చాలా భారం. దీంతో తటపటాయించారు. 'ఆడపిల్ల అంత దూరం ఎందుకులే' అనుకున్నారు. కానీ, గ్రామంలో పెద్ద మనిషి చొరవతో కరుణకి విశాఖ స్కూల్లో సీటు వచ్చింది. క్రికెట్ ఆటలో తన ప్రతిభని గుర్తించిన అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.విజయ, పి.టి టీచర్ తనని ఎంతో ప్రోత్సహించారు.

సంతోషంతో మాటలు రావడం లేదు

మా పిల్ల ఇంత స్థాయికి వెళుతుందని మేము ఊహించలేదు. మా బతుకెంత? మేమెంత? పిల్ల ఇంటికి వస్తే.. మళ్లీ స్కూలుకి పంపించాలంటే చార్జీ డబ్బులు లేక గుండెలు గతుక్కుమనేవి. స్కూలు వాళ్ల ప్రోత్సహంతోనే ఈ స్థాయికి వెళ్లింది. సంతోషంతో మాటలు రావడం లేదు.

– సంధ్య, రాంబాబు, కరుణ తల్లిదండ్రులు

కరుణ ఆల్ రౌండర్

కరుణ మా స్కూల్లో 8వ తరగతి నుండి చేరింది. క్రికెట్ ఒక్కటే కాదు, తను షార్ట్‌పుట్, లాంగ్‌జంప్ కూడా బాగా ఆడుతుంది. పారా అథ్లెట్‌గా సెలక్ట్ అయ్యింది. అయితే మొదట క్రికెట్‌లో అవకాశం రావడంతో అటువైపు వెళ్లింది. మా స్కూలు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తూ వస్తున్నాం. ఈ ఏడాది కరుణతో పాటు మరో ఇద్దరు పిల్లలు పారా అథ్లెటిక్స్‌గా ఎంపికయ్యారు. మా పాఠశాల స్థాపించిన దగ్గర నుండి ఇక్కడి పిల్లలు ఎన్నో పోటీల్లో పాల్గొన్నారు. కానీ కరుణ సాధించిన ఈ విజయం మమ్మల్ని అంతర్జాతీయ వేదికపై గర్వపడేలా చేసింది.

- డి. విజయ, ప్రిన్సిపాల్,
గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ వి.హెచ్(గర్ల్స్), ఎండాడ బీచ్ రోడ్, విశాఖపట్నం.

వెళ్లగొట్టిన చోటే వెలుగొందాడు

'దిల్ భి తేరా, హమ్ భి తేరే' (హృదయం మీదే.. నేనూ మీ వాడ్నే) అంటూ 1960ల్లో విడుదలైన మొదటి సినిమాతోనే అభిమానులని సొంతం చేసుకున్న అలనాటి మేటి బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర. ఆరు దశాబ్దాల పాటు ఏకధాటిగా చిత్రరంగాన్ని ఏలిన ఘనత ఆయనకే దక్కుతుంది. బిమల్ రాయ్ దర్శకత్వంలో 1963 లో వచ్చిన 'బందిని' సినిమా చిత్రసీమలో ఆయన్ని ప్రముఖ నటుల సరసన నిలబెట్టింది. 300 చిత్రాల్లో నటిస్తే అందులో భారీ విజయాలే ఎక్కువ.

1935, డిసెంబరు 8న పంజాబ్ లుధియాన్‌లో ఓ చిన్న పల్లె నస్రాలిలో పుట్టిన ధర్మేంద్ర తండ్రి ప్రభుత్వ స్కూలు టీచర్. ప్రభుత్వ స్కూల్లోనే ఆయన విద్యాభ్యాసం కొనసాగింది. ఆయన కుటుంబ నేపథ్యానికి ఏమాత్రం పోలిక లేకుండా భవిష్యత్తు లక్ష్యాలని ఏర్పాటు చేసుకున్న ధర్మేంద్ర, చిన్న వయసులోనే 'ఫిల్మ్‌ఫేర్' మ్యాగజైన్ కవర్‌పేజీలో మెరిశారు.

కొడుకులు సన్నీ, బాబీ డియోల్‌తో

'నేను మీకు దూరం కాను.. నా మూలాల నుండి నేను ఎప్పటికీ దూరం వెళ్లను. నా మట్టితో నా అనుబంధం గొప్పది. తల్లిలా ప్రేమిస్తాను. ప్రకృతిలో గడపడం నాకు చాలా ఇష్టం. పిల్లాడిలా మారిపోయి ఎంజాయ్ చేస్తాను. అభిమానుల గుండెల్లో ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతాను' అని ఒక ఇంటర్వ్యూలో ధర్మేంద్ర చెప్పిన మాటలు ఆయనలోని ప్రకృతి ప్రేమికుడ్ని గుర్తుచేస్తాయి.

ఉపాధ్యాయుడైన తండ్రి పెంపకంలో ఎంత క్రమశిక్షణగా పెరగాలో చెబుతున్నప్పుడు ఆయన లోని హాస్యచతురతకి నవ్వకుండా ఉండలేం. స్కూలుకి వెళ్లడం కష్టమనుకునే మొద్దబ్బాయి సినిమానే ప్రపంచమని భావించినట్లు ఒకసారి చెప్పారు. కానీ ఆచరణలో అది ఎంత కఠినమైన ప్రయాణమో చాలాసార్లు గుర్తుచేసుకునేవారు.

తిరస్కరణలే సోపానాలుగా..

సినిమా ప్రయత్నాల కోసం ముంబయికి చేరుకున్న ధర్మేంద్ర ఎన్నో ఫిల్మ్ టెస్ట్‌ల్లో రిజక్ట్ అయ్యారు. 'మాకు హాకీ ఆటగాడు కాదు, హీరో కావాలి' అంటూ నిర్మాతలు ఆయన్ని దూరం పెట్టేవారు. అయితే ఈ సందర్భాన్నే ధర్మేంద్ర ఒకసారి ఇలా చెప్పారు. 'ఇన్ని తిరస్కరణల మధ్యే ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ నటనే ఆరాధనగా జీవించాను' అని చెప్పిన ధర్మేంద్ర ప్రపంచం దృష్టిని ఆకర్షించేంతగా కెరియర్‌లో ఎదిగారు.

బాలీవుడ్ 'హీమ్యాన్'గా అభిమానులు ఆయన్ని పిలుచుకుంటారు. 'షోలే' 'వీరూ'గా ప్రేక్షకుల గుండెల్లో ఆయన పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది. కెరియర్ తొలినాళ్లల్లోనే 'అన్పఢ్', 'బందిని' చిత్రాలకి జాతీయ అవార్డులు అందుకున్న ఘనత ఆయనది. 'ఆయా మిలన్ కి బేలా' ఇచ్చిన అద్భుత విజయంతో బాలీవుడ్ చిత్రసీమలో తనకి తాను శక్తిమంతుడిగా నిరూపించుకున్నారు. వరుసగా దశాబ్ద కాలం (1960)లో విడుదలైన 'ఫూల్ ఔర్ పత్తర్', 'మమతా', 'అనుపమ', 'ఆయే దిన్ బాహర్ కే', 'శిఖర్', 'అంఖేన్', 'ఇజ్జత్', 'మేరే హమ్‌దమ్ మేరే దోస్త్' వంటి చిత్రాలు ఇచ్చిన విజయంతో ప్రేక్షకుల గుండెల్లో శాశ్వత ముద్ర వేసుకున్నారు.

1970ల్లో కొత్తతారలు వచ్చినా ఆయన ప్రజాదరణ ఎంతమాత్రం తగ్గలేదు. 'జీవన్ మృత్యు', 'తుమ్ హసీన్ మై జవాన్', 'షరాఫత్', 'కబ్? క్యోం? కహా?' వంటి చిత్రాల విజయంతో ఆయన సూపర్‌స్టార్‌డమ్‌ను సాధించారు. హీరోగా రాణిస్తూనే రాజ్ కపూర్ చిత్రం 'మేరా నామ్ జోకర్'లో సహాయక పాత్ర పోషించారు. ఆ సమయంలో విడుదలైన 'మేరా గావ్ మేరా దేశ్' బ్లాక్‌బస్టర్ విజయం ధర్మేంద్రని తిరుగులేని యాక్షన్ హీరోగా నిలబెట్టింది. 'సీతా ఔర్ గీతా', 'సమాధి', 'రాజా జానీ, లోఫర్' నుండి 'జీల్ కే ఉస్ పార్', 'జుగ్ను', 'యాదోం కి బారాత్', 'దోస్త్' వరకు, ధర్మేంద్ర కెరీర్ దూసుకుపోయింది.

ధర్మేంద్ర, హేమా మాలిని జంట తెరపై ఐకానిక్ స్టార్స్‌గా ఎదిగిన రోజులు కూడా ప్రేక్షకులకి గుర్తుండిపోతాయి. 1975లో విడుదలైన 'షోలే'లో సంజీవ్ కుమార్, హేమ మాలిని, అమితాబ్ బచ్చన్, జయ భాదురి, అమ్జాద్ ఖాన్‌లతో తెరను పంచుకున్నారు. హృషికేష్ ముఖర్జీ 'చుప్కే చుప్కే'లో కీలక పాత్ర పోషించడంతో పాటు, అదే సంవత్సరం హేమ మాలినితో కలిసి దులాల్ గుహ 'ప్రతిజ్ఞ'లో కూడా కనిపించారు. 'చరస్', 'ధరమ్ వీర్', 'చాచా భతీజా', 'ఖేల్ ఖిలారి కా', 'డ్రీమ్ గర్ల్', 'ఆజాద్', 'దిల్లగి' వంటి విజయాలు అందుకున్నారు.

అవార్డులు-ప్రశంసలు

'ఘాయల్' చిత్రానికి గాను 1991లో ఫిల్మ్ ఫేర్ అవార్డు, 1997లో 'హీ మ్యాన్' బిరుదుతో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2005లో జీ సినీ అవార్డు, 2007లో ఐఫా లైఫ్ టైం, 2012లో 'పద్మభూషణ్' అవార్డులతో పాటు ఎన్నో ప్రశంసలు, అవార్డులు ఆయన సొంతం చేసుకున్నారు.


కూతుళ్లు, భార్య హేమమాలినితో

మహిళల కబడ్డీ ప్రపంచ కప్

విజేత భారత్

ఫైనల్లో చైనీస్ తైపీపై గెలుపు

ఢాకా: మహిళల కబడ్డీ ప్రపంచకప్ టైటిల్‌ను భారతజట్టు వరుసగా రెండోసారి కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో భారతజట్టు 35-28పాయింట్ల తేడాతో చైనీస్ తైపీని చిత్తుచేసింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి భారత్ 20-16తో ఆధిక్యంలో నిలిచిన భారత్.. ఆ తర్వాత అదేస్థాయి ప్రదర్శనను కనబర్చింది. మరో ఐదు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా భారత్ 29-24తో నిలిచింది. సంజూ దేవి సూపర్ రెయిడ్‌లో నాలుగు పాయింట్లు తెచ్చి సత్తా చాటగా.. సారథి రీతూ నేగి ట్యాకిల్‌కు యత్నించి గాయపడింది. ఇక సెకండాఫ్‌లోనూ భారత్ తమ పట్టును మరింత బిగించేందుకు ప్రయత్నించింది. అయితే, చైనీస్ తైపీ కూడా అంత తేలికగా తలొగ్గలేదు. చివరకు ఏడు పాయింట్ల తేడాతో గెలిచిన భారత్ వరుసగా రెండో టైటిల్‌ను దక్కించుకుంది. సమయం ముగియడానికి ఇంకా ఐదు నిమిషాలు ఉందన్న సమయంలోనూ చైనీస్ తైపీ పోరాట పటిమ కనబరిచింది. అయితే, భారత జట్టు వారికి మరో అవకాశం ఇవ్వలేదు. 35-28తో చైనీస్ తైపీని ఓడించి జగజ్జేతగా అవతరించింది. తద్వారా.. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. వరుసగా రెండోసారి వరల్డ్‌కప్ టైటిల్ సొంతం చేసుకుంది. ఇప్పటికి ఓవరాల్‌గా ఐదు ప్రపంచకప్ టోర్నీ (3 పురుష, 2 మహిళలు)లు జరుగగా ఐదింట భారత్‌దే విజయం. తొలిసారిగా 2012లో నిర్వహించగా అప్పుడు కూడా భారత జట్టే ఛాంపియన్‌గా నిలిచింది.

ఆఖరి వరకు అజేయంగా..

గ్రూప్ దశలో భారత్ అన్ని మ్యాచుల్లోనూ గెలిచింది. గ్రూప్-'ఎ' నుంచి నాలుగుకు నాలుగు గెలిచి అజేయంగా నిలిచింది. మరోవైపు.. గ్రూప్-'బి'లో చైనీస్ తైపీ సైతం ఐదు మ్యాచ్‌లలోనూ గెలిచింది. ఇక సెమీ ఫైనల్లో భారత్ ఇరాన్‌ను 33-21 పాయింట్ల తేడాతో ఓడించగా.. మరో సెమీస్ మ్యాచ్‌లో చైనీస్ తైపీ బంగ్లాదేశ్‌పై 25-18 పాయింట్ల తేడాతో గెలిచింది. ఇలా ఇరుజట్లు ఫైనల్ చేరగా భారత్-చైనీస్ తైపీపై గెలుపొంది టైటిల్ సొంతం చేసుకుంది. కాగా ఈ మెగా కబడ్డీ ఈవెంట్లో మొత్తం పన్నెండు జట్లు పాల్గొన్నాయి. ఆసియా నుంచి భారత్, ఇరాన్, బంగ్లాదేశ్, చైనీస్ తైపీ, నేపాల్, థాయ్‌లాండ్.. ఆఫ్రికా నుంచి కెన్యా, ఉగాండా, జాంజిబార్.. యూరోప్ నుంచి పోలాండ్, జర్మనీ.. దక్షిణ అమెరికా నుంచి అర్జెంటీనా పాల్గొన్నాయి.

201పరుగులకే కుప్పకూలిన భారత్

దక్షిణాఫ్రికాకు 314పరుగుల ఆధిక్యత

గౌహతి: గువాహటి టెస్టు ఆశలూ సన్నగిల్లుతున్నాయి. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 201 పరుగులకే కుప్పకూలడమే ఇందుకు ప్రధాన కారణం. క్రీజులో నిలవాల్సిన టాపార్డర్, మిడిలార్డర్ చెత్త ఆటతో పెవీలియన్‌కు చేరగా.. లోయర్ ఆర్డర్‌లో వాషింగ్టన్ సుందర్ (48), కుల్దీప్ యాదవ్(19) అద్భుతంగా పోరాడారు. ఈ జోడీ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. ఓవర్‌నైట్ స్కోర్ 9పరుగులతో సోమవారం మూడో రోజు ఆటను కొనసాగించిన భారతజట్టును దక్షిణాఫ్రికా పేసర్ మార్కో యాన్సెన్(6/48) నడి విరగ్గొట్టాడు. భారత్ బ్యాటర్లలో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (58) ఒక్కడే అర్థసెంచరీతో రాణించాడు. ఒకదశలో వికెట్ నష్టానికి 95 పరుగులతో మెరుగైన స్థితిలో ఉన్న భారత్.. ఆ తర్వాత 122/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ (22), సాయి సుదర్శన్ (15) విఫలమయ్యారు. ధ్రువ్ జురెల్ (0), రిషభ్ పంత్ (7), రవీంద్ర జడేజా (6), నితీశ్ కుమార్ రెడ్డి (10) ఘోరంగా నిరాశపర్చారు. కేవలం 27 పరుగుల వ్యవధిలో ఆరు వికెట్లు కోల్పోయి పలు విమర్శలను ఎదుర్కొంది. దీంతో దక్షిణాఫ్రికా 288 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించింది. ఈ నేపథ్యంలో టీమిండియాను ఫాలో ఆన్ ఆడించాల్సిన ప్రొటిస్ కెప్టెన్ తెంబా బవుమా ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. తామే రెండో ఇన్నింగ్స్ మొదలుపెడతామని తెలిపాడు. దీంతో దక్షిణాఫ్రికా సోమవారం నాటి మూడో రోజు ఆట ముగిసే సరికి ఎనిమిది ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 26 పరుగులు చేసింది. ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ 13, ఐడెన్ మార్క్రమ్ 12 పరుగులతో క్రీజులో నిలిచారు. ఫలితంగా మూడో రోజు ముగిసేసరికి సౌతాఫ్రికా టీమిండియాపై తొలి ఇన్నింగ్స్‌లో ఓవరాల్‌గా 314 పరుగుల ఆధిక్యం సంపాదించింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్‌కి తోడు హర్మర్‌కు మూడు, కేశవ్ మహరాజ్ ఒక వికెట్ తీశారు.

చరిత్ర సృష్టించిన యాన్సెన్..

సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టీమిండియాతో టెస్టు మ్యాచ్‌లో అర్ధ శతకం బాదడంతో పాటు.. ఆరు వికెట్లు తీసిన తొలి ప్రొటిస్ ఆటగాడిగా నిలిచాడు. గువాహటి టెస్టు సందర్భంగా యాన్సెన్ ఈ ఘనత సాధించాడు. దీంతో భారత్‌ను 201 పరుగులకే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ధ్రువ్ జురెల్(0), కెప్టెన్ రిషభ్ పంత్(7), రవీంద్ర జడేజా(6), నితీశ్ కుమార్ రెడ్డి(10) రూపంలో కీలక బ్యాటర్లను అవుట్ చేశాడు. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ (19), జస్ప్రీత్ బుమ్రా (5)లను వెనక్కి పంపి.. భారత జట్టు ఇన్నింగ్స్‌ను 201 పరుగులకే పరిమితం చేశాడు. ఈ క్రమంలో యాన్సెన్ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. టీమిండియాతో టెస్టు మ్యాచ్‌లో అర్ధ శతకం చేయడంతో పాటు.. ఒకే ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు కూల్చిన తొలి సౌతాఫ్రికా క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు. అంతేకాదు.. భారత్‌లో టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ గణాంకాలు (6/48) నమోదు చేసిన విదేశీ లెఫ్టార్మ్ పేసర్ల జాబితాలోనూ యాన్సెన్ చేరాడు.

नालको NALCO
नेशनल एल्यूमिनियम कंपनी लिमिटेड
(भारत सरकार का एक उपक्रम)
नालको भवन, प्लाट सं. पी/1, नयापल्ली, भुवनेश्वर - 751013, (ओड़िशा)
सीआईएन : L27203OR1981GOI000920
एक नवरत्न कम्पनी
विज्ञापन संख्या 10250701
रेलवे परिचालन समन्वयक की आवश्यकता
नालको, खान मंत्रालय, भारत सरकार के तहत सार्वजनिक क्षेत्र का एक नवरत्न लोक उद्यम है जो दो वर्षों की अवधि के लिए समेकित मासिक पारिश्रमिक के आधार पर वाल्टेयर डिवीजन, पूर्वी तट रेलवे, विशाखापत्तनम के लिए एक रेलवे परिचालन समन्वयक की तलाश कर रहा है। इच्छुक उम्मीदवार कंपनी की अधिकारिक वेबसाइट www.nalcoindia.com के कैरियर अनुभाग पर बिवरण देख सकते हैं।
मुख्य महाप्रबंधक (मानव संसाधन)-भर्ती एवं पदोन्नति

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68